


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



ప్రధాని మోదీతో సుందర్ పిచాయ్ భేటీ

- వివరాలు 4 లో..



## అదరహో.. ఐఎఫ్ఆర్

విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వేడుకలు బుధవారం అట్టహాసంగా మొదలయ్యాయి. భారత సర్వసైన్యాధిపతి, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఫ్లీట్ రివ్యూలో భాగంగా నౌకాదళ సిబ్బంది నుంచి ద్రౌపదీ ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ యుద్ధ నౌకలో ప్రయాణించారు. రాష్ట్రపతివెంట గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. సముద్ర అలలపై వరుసగా నిలిచిన యుద్ధ నౌకలను వీక్షించారు. అనంత సాగర జలాలలో భారత నౌకాదళ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పే మహత్తర ఘట్టం -వారంపాటు సాగనుంది.

2

### 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'

## అన్నింటా ఇదే ప్రాతిపదిక

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ప్రాతిపదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశనిర్దేశం చేశారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపం దాల్చాలని, ఇప్పటివరకు ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల యాజమాన్యాలతో నిరంతరం సంప్రదింపులు జరిపి ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. బుధవారం సీఎం అధ్యక్షతన జరిగిన 15వ ఎస్ఐపీబీ సమావేశం.. రూ.29వేల కోట్ల విలువైన 27 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. 22,407మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా.



- పెట్టుబడుల సాకారంపై నిరంతరం దృష్టి
- ఇకపై ప్రతీ నెలా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష
- 15వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- 27 ప్రాజెక్టులు, రూ.29,021 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టులతో 22,407 మందికి ఉద్యోగావకాశాలు

3

### 22ఏ నుంచి ప్రైవేటు భూముల

## తొలగింపు సరళతరం



- ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్
- పేదలకు లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకున్నాం
- అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్

- వివరాలు 11 లో..



### ఉభయగోదావరిలో

## డ్రైనేజ్ సమస్యపై సర్వే

- సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం
- పంట నష్టాలపై రైతులకు న్యాయం చేస్తాం
- దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు సాయానికి ప్రతిపాదన
- అసెంబ్లీలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

9

## ఆనందాలు నిండుగా.. ఆత్మీయ పండుగ



5

## అసెంబ్లీ ఆవరణలో 'ఆప్కో' స్టాళ్లు

- బడ్జెట్ సమావేశాల ముగిసే వరకూ నిర్వహణ
- ప్రఖ్యాత గాంచిన చేనేత వస్త్రాల విక్రయం
- నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

10



# ఒక నిజాయితీ.. ఒక హెరిటేజ్

### ఏ దేవాలయానికీ నెయ్యి సరఫరా చేయలేదు..

FACT SHEET

డైవర్షన్ రాజకీయాలు వైసీపీ ముష్కర మూకలకు కొత్త కాదు. ఐదేళ్ల దుష్పరిపాలనతో ఆంధ్రా గోబెల్స్‌గా ఖ్యాతి తెచ్చుకున్న జగన్ అండ్ కో.. సుపరిపాలనతో దూసుకుపోతున్న కూటమిపై బురద రాజకీయాలకు పాల్పడుతూనే ఉంది. అందులో భాగమే -వైసీపీ ప్రభుత్వం పాల్పడిన కల్తీ నెయ్యి ఘట్టంలోకి హెరిటేజ్‌ను లాగడం. తమకంటిన బురదను ఎదుటివాళ్లకూ అంటించి.. మానసిక ఆనందం పొందే పైశాచికత్వానికి పరాకాష్ఠ ఘట్టమిది. నేడో రేపో ప్రజల ముందుకొచ్చి -పచ్చి అబద్ధాలను పల్లపర్చే ప్రయత్నంలో వైసీపీ జగన్ ఉన్న నేపథ్యంలో -హెరిటేజ్ ఫుడ్స్ సచ్ఛీలతపై ఫ్యాక్ట్ షీట్ ఇది.

4

### ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర

- 34 ఏళ్ల విశ్వసనీయతకు మచ్చ తెచ్చే ప్రయత్నం
- వైసీపీ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు
- ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

7

Heritage™ HEALTH AND HAPPINESS

4

### తప్పుడు ఆరోపణలు ఉపసంహరించుకోవాలి

- జగన్ ప్రేరేపణతోనే అసత్య ప్రచారం
- బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు
- బొత్సకు హెరిటేజ్ ఫుడ్స్ లీగల్ నోటీసులు

# అదరహో.. ఐఎఫ్‌ఆర్





- విశాఖ తీరంలో భారత నౌకాదళ మహా ప్రదర్శన
- హాజరైన సర్వసైన్యాధిపతి ద్రౌపదీ ముర్ము
- ఫ్లీట్ రివ్యూలో యుద్ధ నౌకలనుంచి వందన స్వీకారం
- రాష్ట్రపతివెంట గవర్నర్ నజీర్, సీఎం చంద్రబాబు
- సహచరితో కలిసి హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్
- ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణం
- ప్రత్యేక ఆకర్షణగా భారత మిత్రదేశాల నౌకల ఫ్లీట్

విశాఖపట్నం (చైతన్య రథం): అనంత సాగర జలాలలో భారత నౌకాదళ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పే మహత్తర ఘట్టం విశాఖ మహానగరం వేదికగా అట్టహాసంగా సాగింది. ఒకేసారి మూడు ఉత్సవాలు (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026, మిలాన్-2026, ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం) ఇంత పెద్దఎత్తున నిర్వహించడం చరిత్రలో ఇదే తొలిసారి. 'సాగర జలాల్లో స్నేహ వారధుల బలోపేతం' అన్న నినాదంతో జరుగుతున్న వేడుకలకు భారత సర్వ సైన్యాధిపతి, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరయ్యారు. కేవలం యుద్ధ నౌకలు, పాటవాల ప్రదర్శనకే పరిమితం కాకుండా దేశాల మధ్య స్నేహం, సహకారానికి ప్రతీకగా ఈ ఫ్లీట్ నిలిచింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ బలమైన శక్తి అని చాటిచెప్పేలా వేడుకల సందర్భంగా స్నేహపూర్వక దేశాలన్నీ ఒకేచోట చేరాయి. వీటిద్వారా ప్రపంచ శాంతి, సముద్ర భద్రతకు కొత్తదారులు వేయాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

అట్టహాసంగా సాగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బందినుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాలనుంచి 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్ గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి. అంతకుముందు విశాఖపట్నం తీరంలో నౌకాదళ అధికారులు అందించిన గౌరవ వందనాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వీకరించారు. అనంతరం రాష్ట్రపతితోపాటు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ యుద్ధ నౌకల విన్యాసాలను వీక్షించారు. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో దాదాపు భారత్‌నుంచి 71 యుద్ధ నౌకలు, సబ్ మెరైన్లు, కోస్ట్ గార్డు నౌకలు పాల్గొన్నాయి. అలాగే 20 దేశాలనుంచి వచ్చిన మరికొన్ని నౌకలు సైతం రివ్యూలో పాల్గొన్నట్లు నౌకాదళ అధికారులు వెల్లడించారు. కాగా అంతర్జాతీయ నౌకల సమీక్షను చేస్తున్న తొలి మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము రికార్డు సృష్టించడం విశేషం. భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ఐఎఫ్ఆర్-2026 సాగింది. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఉత్తర అరేబియా సముద్రంలో మోహరించి పాక్‌ను వణికించిన విక్రాంత్ ఇప్పుడు విశాఖ తీరంలో ప్రపంచ దేశాలకు తన శక్తిసామర్థ్యాలు ప్రదర్శించేందుకు విచ్చేసింది. కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల పాల్గొన్నారు.

## నేడు పరేడ్

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో అమెరికా, రష్యా పాల్గొంటుండగా.. జర్మనీ, ఫిలిప్పీన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి తొలిసారిగా యుద్ధనౌకలు హాజరయ్యాయి. చైనా, టర్కీ, పాక్ దేశాలను భారత్ ఆహ్వానించలేదు. ఐఎఫ్ఆర్-2026, మిలన్-2026, ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియంకు ఆతిథ్యమిస్తున్న విశాఖనగరంలో నౌకాదళ సత్తా అందరికీ తెలిసేలా నేటి సాయంత్రం ఆర్కే బీచ్‌లో పరేడ్ జరగనుంది. ఇందులో 8వరకు విదేశీ నావికా బృందాలు పాల్గొంటాయి. 45 బృందాలు పరేడ్‌లో భాగస్వామ్యమవుతాయి.

ఈ సందర్భంగా జరిగే సాహస విన్యాసాల ప్రదర్శన కోసం యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ ట్యాంకులు ముమ్మర కసరత్తు చేశాయి. కమోవ్, ధ్రువ్, సీ కింగ్ హెలికాప్టర్లు, డార్నియర్, హాక్, మిగ్-29కే నౌకాదళ యుద్ధ విమానాలు ఆకాశంలో రకరకాల విన్యాసాలు చేస్తాయి. చేతక్ హెలికాప్టర్లు రెస్క్యూ ఆపరేషన్ చేపడతాయి. ఈ పరేడ్‌కు అనుబంధంగా యుద్ధ నౌకలపై నేవీ సెయిలర్స్ విన్యాసాలు నిర్వహిస్తారు.

## దశాబ్దం తరవాత..

విశాఖలో మిలన్ విన్యాసాలు పదేళ్ల తర్వాత జరుగుతున్నాయి. గత కొద్దిరోజులుగా నగరవాసులు మిలన్‌పై ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి మిలన్‌కి భారత్ అధ్యక్షస్థానంలో బాధ్యతలను నిర్వర్తిస్తుండగా 65దేశాలు పాల్గొంటున్నాయి. మిలన్ విలేజ్‌లో మిలన్, ఐఎఫ్ఆర్‌కు సంబంధించిన టోపీలు, బ్యాగులు, కొయ్య బొమ్మలు, మట్టి కుండలు, రుచికరమైన వంటల స్టాల్స్, చేనేత, హస్తకళల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈనెల 21 వరకు మిలన్ విలేజ్ కొనసాగుతుంది. ఈనెల 21నుంచి 25 వరకు హార్బర్ ఫేజ్‌లో భాగంగా విదేశీ యుద్ధ నౌకలు, భారత నౌకాదళం కలిసి బంగాళాఖాతం మధ్యలో రకరకాల విన్యాసాలు నిర్వహిస్తాయి.

హిందూ మహా సముద్రం, పసిఫిక్ ప్రాంతానికి చెందిన నౌకాదళాల చీఫ్‌లు, ఉన్నతాధికారులు పాల్గొనే ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం ఈనెల 20న విశాఖలోనే నిర్వహిస్తారు. దీనికి 65 దేశాల నేవీ ప్రతినిధులు హాజరవుతారు. పరస్పర సహకారం, అభివృద్ధి, సాంకేతిక మార్పిడివంటి వాటిపై చర్చించనున్నారు. ఈనెల 21నుంచి 25వరకు బంగాళాఖాతంలో మిలన్ 2026 సీఫేజ్ విన్యాసాలు పూర్తి చేసుకుని విదేశాలనుంచి వచ్చిన యుద్ధ నౌకలు ఆయా దేశాలకు పయనమవుతాయి. మన నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు కూడా ఈ సీఫేజ్ తర్వాత తమ తమ స్థావరాలకు చేరుకుంటాయి.



# స్పీడ్ ఆఫ్ రూల్!

## పాలనను పరిగెత్తిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): పొలిటికల్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు నాయుడు పూర్తిస్థాయి దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి వరుసపెట్టి జిల్లా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ.. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్ మంత్రి, కలెక్టర్, ఎస్పీ సమక్షంలో అన్ని విషయాలపై సమగ్ర చర్చ సాగిస్తున్నారు. పొలిటికల్ గవర్నెన్స్, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణపై నివేదికల ఆధారంగా ఈ సమీక్షలు సాగుతున్నాయి. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, ప్రధాన సమస్యల సత్వర పరిష్కారంపై సమీక్షలలో దృష్టి పెడుతున్నారు. ఇప్పటి వరకు 4 జిల్లాల ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షలు నిర్వహించారు. మన్యం, అల్లూరి, పోలవరం జిల్లాల ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షలు ముగిశాయి. ప్రతి రోజూ అసెంబ్లీ అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు సమావేశమవుతున్నారు. ఎమ్మెల్యేల పనితీరు, నియోజకవర్గ స్థితిగతులపై నివేదికల ఆధారంగా సీఎం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అధికారుల పనితీరు, జిల్లాలో పరిస్థితులపై నివేదికల సారాంశం సమీక్షల్లో ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. మండల స్థాయి సమస్యలు, తాగు, సాగునీటి ప్రాజెక్టులపై చర్చ, పరిష్కారం దిశగా చర్యలు, పెండింగ్ నిర్మాణాలు, రోడ్లు, మున్సిపాలిటీల్లో లెగసీ సమస్యలపై చర్చ సాగిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేల పనితీరు అంశాలపై స్పష్టమైన డేటాతో సమీక్షలు జరుపుతున్నారు. 6 -7 నివేదికలు, సర్వేలు, రిపోర్టుల ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును లెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. బాగా పనిచేసే ఎమ్మెల్యేలను భేటీలోనే మెచ్చుకుంటూ ప్రోత్సహిస్తున్నారు. వెనుకబడిన విభాగాల్లో బాగా పనిచేయాలని పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. వివిధ విభాగాల్లో అధికారుల పనితీరుపై నివేదికల ఆధారంగా ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, అధికారులతో ఒకేసారి భేటీ కావడంతో జిల్లాలోని ప్రధాన సమస్యల ప్రస్తావనకు వస్తున్నాయి. చిన్న సమస్యల సత్వర పరిష్కారానికి నిధుల విడుదలకు సీఎం ఆదేశాలు జారీ చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో పూర్తి చేసి అందుబాటులో తెచ్చే ప్రాజెక్టులకు వెంటనే నిధుల విడుదల చేయాలని సూచిస్తున్నట్టు తెలుస్తోంది. పనిచేయని, సమస్యలు సృష్టిస్తున్న అధికారులను భరించాల్సిన అవసరం లేదని నిర్మొహమాటంగా చెబుతూనే.. ఇన్‌ఛార్జ్ మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేస్తున్నారు.

## 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'

# అన్నింటా ఇదే ప్రాతిపదిక

- పెట్టుబడుల సాకారంపై నిరంతరం దృష్టి
- ఇకపై ప్రతీ నెలా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష
- 15వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- 27 ప్రాజెక్టులు, రూ.29,021 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టులతో 22,407 మందికి ఉద్యోగావకాశాలు



అమరావతి (చైతన్య రథం): స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ ప్రాతిపదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టులు త్వరితగతిన కార్యరూపం దాల్చాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఇప్పటివరకు ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల యాజమాన్యాలతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరిపి ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తి చేసేలా చూడాలన్నారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 15వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం వివిధ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. సమావేశానికి మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల రంగాలకు చెందిన 27 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. రూ.29,021 కోట్ల విలువైన ప్రాజెక్టులకు 15వ ఎస్ఐపిబి సమావేశం ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 22,407 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలైన గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్‌వంటి మెగా ప్రాజెక్టులు వరుసగా ఏర్పాటు కావాల్సి ఉందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. భూకేటాయింపులు జరిపినప్పటికీ నిర్ణీతకాల వ్యవధిలో పనులు ప్రారంభించని సంస్థలతో సంప్రదింపులు జరపాలని, నిర్మాణానికి ముందుకు రాకుంటే భూములు వెనక్కి తీసుకునేందుకు వెనకాడవద్దని చెప్పారు. దీనిపై మంత్రుల కమిటీ దృష్టి పెట్టి.. అవసరమైతే అనుమతులు రద్దు చేయాలన్నారు. ప్రతీ ఒప్పందమూ వేగంగా సాకారం కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేలా ఎన్నారైలను ఆహ్వానించాలని అధికారులను సీఎం నిర్దేశించారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులు మరిన్ని వచ్చేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అలాగే సొంత భూముల్లో ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేవారికి అదనపు ప్రోత్సాహకాలు అందించే విషయాన్ని పరిశీలించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

### ఐకానిక్‌గా విశాఖలో 'భారత్ మండపం'

విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. సూర్యలంక, పోలవరం, పులికాట్, గండికోట, శ్రీశైలం, మదనపల్లి, హార్స్లీ హిల్స్‌వంటి క్లస్టర్లు ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆయా క్లస్టర్లలో షాపింగ్ మాల్స్, హోటల్స్‌వంటివి వస్తే పర్యాటకుల్ని మరింతగా ఆకట్టుకోవచ్చని చెప్పారు. విశాఖలో భారత్ మండపం వస్తోందని అది ఐకానిక్‌గా నిలిచేలా చూడాలన్నారు. దేశంలోనే అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్‌గా నిలవాలన్నారు. అలాగే ప్రతీ జిల్లాలో శిల్పారామాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ, ఏలూరులాంటి ప్రాంతాలు సహా రాష్ట్రంలో మరిన్ని హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లు రావాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. 50 వేల రూములు లక్ష్యం కావాలన్నారు. రాష్ట్రంలో జాతీయస్థాయి మెగా ఈవెంట్లు జరగాల్సి ఉందన్నారు. స్పోర్ట్స్ సిటీ, క్రియేటివ్ సిటీ, ఎకో సిస్టంలాంటివి రాష్ట్రంలో నెలకొనాలన్నారు. హెల్త్ టూరిజం కూడా గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. తిరుపతిలో కలినరీ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుపై ఏపీలోని ఆహారరంగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని, హాస్పిటాలిటీలో డీమ్డ్ యూనివర్సిటీవంటి వాటిని ప్రమోట్ చేయాలని సీఎం చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లోనూ విప్లవాత్మకమైన మార్పులు అందిపుచ్చుకోవాలన్నారు. ఆక్వా కల్చర్‌లో వాల్యూ అడిషన్ జరిగినప్పుడే, అమెరికాకు ఎగుమతులు మళ్లీ పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దీంతో డైరీ, పౌల్ట్రీ, లైవ్ స్టాక్, మీట్ ఎగుమతులూ పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిని మ్యారేజ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలన్ని సీఎం సూచించారు.

### ఉద్యోగాల వివరాలతో నైపుణ్యం పోర్టల్

ఇకపై ప్రతీ నెలా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష చేస్తానని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన ప్రాజెక్టులతోపాటు సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఒప్పందం జరిగిన ప్రాజెక్టుల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. కార్యకలాపాలు ప్రారంభించే తేదీని కూడా స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఇప్పటివరకు యువతకు లభించిన ఉద్యోగాల వివరాలు నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించాలని సూచించారు. ఇంకా ఎన్ని ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయో కూడా తెలిసేలా రియల్ టైమ్‌లో అప్డేట్ చేయాలన్నారు. త్వరలో వేర్ హౌసింగ్ పాలసీని కూడా తీసుకురావాలని అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. విశాఖ, విజయావాడ తిరుపతి నగరాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు 15సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు జరగ్గా మొత్తం రూ.9,03,726 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 8,58,082 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.


### 15వ ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపిన ప్రాజెక్టులు

1. యశస్వ పవర్ ఎల్ఎల్పీ. శ్రీ సత్యసాయి జిల్లాలో సోలార్ విద్యుత్ పార్క్. రూ.1,200 కోట్ల పెట్టుబడి, 690 మందికి ఉద్యోగాలు.
2. క్రోమా ఆటార్ ఇంటర్నేషనల్. పల్నాడు జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్. రూ.2,000 కోట్ల పెట్టుబడి, 5 వేల మందికి ఉద్యోగాలు.
3. క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రీడ్ ట్వల్వ్ ప్రైవేట్ లిమిటెడ్. అనంతపురం జిల్లాలో పవర్ ప్రాజెక్టు. రూ.1,391 పెట్టుబడి, 200మందికి ఉద్యోగాలు
4. క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రీడ్ థర్టీన్ ప్రైవేట్ లిమిటెడ్. అనంతపురం జిల్లాలో పవర్ ప్రాజెక్టు. రూ.1,391 పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు
5. రెన్యూ ఫోటో వోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్. కర్నూలు జిల్లాలో సోలార్ హైబ్రీడ్ ప్రాజెక్టు. రూ.1,461 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాలు
6. ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీలిమిటెడ్. కర్నూలు జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు. రూ.4,500 కోట్ల పెట్టుబడి, 3,100 మందికి ఉద్యోగాలు.
7. అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ప్యాకేజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్. విశాఖలో సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్ట్ ఫెసిలిటీ ప్రాజెక్టు. రూ.2,387.81 కోట్ల పెట్టుబడి, 1,000 మందికి ఉద్యోగాలు
8. కంపాస్ ఎంటర్ ప్రైజెస్‌ప్రైవేట్ లిమిటెడ్. తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటక ప్రాజెక్టు. రూ.101.28కోట్ల పెట్టుబడి, 150మందికి ఉద్యోగాలు
9. ఆకేసియా హోటల్స్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్. గుంటూరు జిల్లాలో పర్యాటక ప్రాజెక్టు. రూ.330 కోట్ల పెట్టుబడి, 372మందికి ఉద్యోగాలు
10. వీరాంజనేయ హాస్పిటాలిటీ. విశాఖలోని రుషికొండలో పర్యాటక ప్రాజెక్టు. రూ.89.32 కోట్లు పెట్టుబడి, 150 ఉద్యోగాలు
11. అక్షయ హోటల్స్ అండ్ రిసార్ట్స్. బాపట్ల జిల్లాలో టూరిజం ప్రాజెక్టు. రూ.54.02 కోట్ల పెట్టుబడి, 80 మందికి ఉద్యోగాలు
12. ఎకో ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్. అల్లూరి జిల్లాలో పర్యాటక ప్రాజెక్టు. రూ.262.87 కోట్లు, 500 మందికి ఉద్యోగాలు
13. సైబర్ సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, దివ్యశ్రీ హోల్డింగ్స్ కన్సార్షియం. తిరుపతిలో పర్యాటక ప్రాజెక్టు. రూ.1,226.32 కోట్ల పెట్టుబడి, 1,500 మందికి ఉద్యోగాలు.
14. కేపీసీ ప్రాజెక్ట్సు లిమిటెడ్. విశాఖలో టూరిజం ప్రాజెక్టు. రూ.280.51 కోట్ల పెట్టుబడి, 310 మందికి ఉద్యోగాలు
15. రుషికొండ బీచ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్. విశాఖలో పర్యాటక ప్రాజెక్టు. రూ.424.20 కోట్ల పెట్టుబడి, 450 మందికి ఉద్యోగాలు
16. ఎస్వీఎస్ కనస్ట్రక్షన్స్. పర్యాటక ప్రాజెక్టు. రూ.104 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
17. రాధికా వెజిటబుల్ ఆయిల్స్ లిమిటెడ్. విజయనగరం జిల్లాలో పామాయిల్ ప్రాసెసింగ్ యూనిట్. రూ.240 కోట్ల పెట్టుబడి, 304 మందికి ఉద్యోగాలు
18. హెరిటేజ్ ఫుడ్స్‌లిమిటెడ్. తిరుపతిజిల్లా చంద్రగిరిలో మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్. రూ.209.68 కోట్ల పెట్టుబడి, 35 మందికి ఉద్యోగాలు
19. ఏసీఈ ఇంటర్నేషనల్ లిమిటెడ్. చిత్తూరు జిల్లాలో డైరీ ప్రాసెసింగ్ యూనిట్. రూ.786.15 కోట్లు, 1,000 మందికి ఉద్యోగాలు.
20. వారీ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్. అనకాపల్లి జిల్లాలో లీథియ ఆయాన్ సెల్స్ గిగా ఫ్యాక్టరీ. రూ.8,175 కోట్లు పెట్టుబడి, 3 వేలమందికి ఉద్యోగాలు
21. సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్. కర్నూలు జిల్లాలో సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్. రూ.314.66 కోట్లు, 780 మందికి ఉద్యోగాలు.
22. నాన్ గ్రీన్ మెట్ ప్రైవేట్ లిమిటెడ్. నాయుడుపేటలో లిథియం ఆయాన్ బ్యాటరీ ప్రాసెసింగ్ యూనిట్. రూ.1,366 కోట్లు, 340 మందికి ఉద్యోగాలు.
23. బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్. అనకాపల్లి జిల్లాలో ఎండీఎఫ్ బోర్డు తయారీ యూనిట్. రూ.58.19 కోట్లు
24. సిరి బయోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్. ఎన్టీఆర్ జిల్లా పౌల్ట్రీ, ష్రింప్,ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్. రూ.37 కోట్ల పెట్టుబడి, 74 మందికి ఉద్యోగాలు.
25. సిరి బయోనిక్స్ ప్రైవేట్ లిమిటెడ్. శ్రీ సత్యసాయి జిల్లాలో పౌల్ట్రీ, ష్రింప్, ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్. రూ.22 కోట్ల పెట్టుబడి, 37మందికి ఉద్యోగాలు
26. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్. నెల్లూరు జిల్లాలో డిఫెన్స్ ఎక్స్‌ప్లోజివ్స్ తయారీ యూనిట్. రూ.500 కోట్ల పెట్టుబడి, 2,050 మందికి ఉద్యోగాలు.
27. స్కై స్టోరేజ్ లిమిటెడ్. విశాఖ జిల్లాలో వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్ యూనిట్. రూ.106 కోట్ల పెట్టుబడి, 285 మందికి ఉద్యోగాలు.


# ఒక నిజాయితీ.. ఒక హెరిటేజ్

## ఏ దేవాలయానికీ నెయ్యి సరఫరా చేయలేదు..

డైవర్షన్ రాజకీయాలు వైసీపీ ముష్కర మూకలకు కొత్త కాదు. ఐదేళ్ల దుష్పరిపాలనతో ఆంధ్రా గోబెల్స్‌గా ఖ్యాతి తెచ్చుకున్న జగన్ అండ్ కో.. సుపరిపాలనతో దూసుకుపోతున్న కూటమిపై బురద రాజకీయాలకు పాల్పడుతూనే ఉంది. అందులో భాగమే -వైసీపీ ప్రభుత్వం పాల్పడిన కల్తీ నెయ్యి ఘట్టంలోకి హెరిటేజ్‌ను లాగడం. తమకంటిన బురదను ఎదుటివాళ్లకూ అంటించి.. మానసిక ఆనందం పొందే పైశాచికత్వానికి పరాకాష్ట ఘట్టమిది. మండలిలో ఉధృతంగా సాగుతోన్న కల్తీ నెయ్యి ఘట్టంపై చర్చను పక్కదోవ పట్టించేందుకు -ఇటు హెరిటేజ్‌పైన, అటు మంత్రి లోకేష్‌పైన అప్రస్తుత వ్యాఖ్యలు, అనుచిత విమర్శలకు తెగబడుతోంది వైసీపీ. మంత్రి నారా లోకేష్ కొలంబో పర్యటనపై వైసీపీ సాగించిన దుష్ప్రచారం అలాంటి బురద రాజకీయాల్లో భాగమే. నేడో రేపో ప్రజల ముందుకొచ్చి -పచ్చి అబద్ధాలను పల్లపర్చే ప్రయత్నంలో వైసీపీ జగన్ ఉన్న నేపథ్యంలో -హెరిటేజ్ ఫుడ్స్ సచ్ఛీలతపై ఫ్యాక్ట్ షీట్ ఇది.



- ఇండాపూర్ డెయిరీకి నెయ్యిని హెరిటేజ్ సరఫరా చేయలేదు.
- అమూల్, దొడ్ల డెయిరీలతోపాటు హెరిటేజ్ కూడా పాల ఉత్పత్తులు ఇండాపూర్‌నుంచి కొనుగోలు చేసింది.
- లడ్డూ ప్రసాదంలో నెయ్యి కుంభకోణాన్ని డైవర్ట్ చేయడానికే హెరిటేజ్‌పై నిరాధార నిందులు.
- హెరిటేజ్‌పై నిరాధార నిందలు వేస్తున్న సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలి.
- ఏ ప్రభుత్వానికి హెరిటేజ్ నెయ్యి సరఫరా చేయలేదు.
- ఏ ఇతర కంపెనీలకూ నెయ్యి సం చేయలేదు.
- హెరిటేజ్ నేరుగా మార్కెట్లో వినియోగదారులకు నెయ్యి అమ్ముతున్నది.
- హెరిటేజ్ ఇండాపూర్ డెయిరీతోగానీ, ఇతర ఏ సంస్థతోగానీ నెయ్యి తయారీ లేదా సరఫరా కోసం ఒప్పందాలు లేవు.
- హెరిటేజ్ ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ టీటీడీకి నెయ్యి సరఫరాలో ఎలాంటి పాత్ర లేదు.
- హెరిటేజ్ ఇండాపూర్‌నుంచి కొనుగోలుదారే గానీ, ఇండాపూర్‌కు ఉత్పత్తులు అమ్మే సంస్థ కాదు.
- ఇండాపూర్ ద్వారా హెరిటేజ్ టీటీడీకి నెయ్యి సరఫరా జరిగిందని వైసీపీ చేసే ఆరోపణలు అబద్ధాలు మాత్రమే.
- టీటీడీ లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ కుంభకోణంలో వైసీపీ నేతల పాత్రపై ప్రజాదృష్టి మళ్లించడానికే హెరిటేజ్‌పై అబద్ధాల దాడి చేస్తున్నారు.
- ఇండాపూర్ డెయిరీ ప్రకటన
- తమ సంస్థకు హెరిటేజ్ ఎటువంటి యాజమాన్య లేదా నిర్వహణ సంబంధాలు లేవని ప్రకటన చేసింది.
- బీ2బి సరఫరాదారుగా ఇండాపూర్ ఉన్నదని పేర్కొన్నారు.
- ఇండాపూర్‌నుంచి హెరిటేజ్ యుహెచ్‌టి పాలు, ఎస్ఎంపి, పన్నీరువంటివి కొనుగోలు చేస్తున్నదేగాని అమ్మడం లేదు.
- ఇండాపూర్ డెయిరీ స్వతంత్ర సంస్థ.
- పాల ఉత్పత్తుల్లో ఇండాపూర్ దేశంలోనే మొదటి 5 అతి పెద్ద డెయిరీలలో ఒకటిగా ఉన్నది.
- పాల ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలో 2వ స్థానంలో ఉన్నది.
- ఇండాపూర్ రష్యా, మధ్యప్రాచ్యం, ఆగ్నేయ ఆసియా దేశాలకు ఎగుమతులు చేస్తున్నది.
- అలాగే దేశంలో ఇండాపూర్ డెయిరీ తమ ఉత్పత్తుల్ని అమూల్, మదర్ డెయిరీ, బ్రిటానియా, దొడ్ల డెయిరీ, హెరిటేజ్ సంస్థలకు పాల ఉత్పత్తుల్ని అమ్ముతున్నది.
- ఇండాపూర్ ఆధ్యాత్మిక సంస్థలైన పతంజలి, శ్రీ వేదసత్య, షిర్డీసాయి, స్వర్ణ దేవాలయాలకు నెయ్యి సరఫరా చేస్తున్నది.
- అలాగే డీమార్ట్, జొమాటోవంటి సంస్థలకు పాల ఉత్పత్తులకు సరఫరా చేస్తున్నది.
- హెరిటేజ్ ఇండాపూర్ డెయిరీకి కొనుగోలుదారేగానీ, సరఫరాదారు కాదనేది వాస్తవం.
- హెరిటేజ్ ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ టీటీడీ నెయ్యి సరఫరాలో ఎలాంటి పాత్ర లేదనేది వాస్తవం.
- టీటీడీ లడ్డూ ప్రసాదాల్లో వైసీపీ నేతల కుంభకోణాల నుండి ప్రజాదృష్టి మళ్లించడానికే హెరిటేజ్‌పై నిరాధార నిందలు వేస్తున్నారు.
- ఈ దుర్మార్గ వైసీపీ ప్రచారాల్ని ప్రజలు నిరసిస్తారు. వైసీపీ టీటీడీ నెయ్యి కల్తీ మహాపాపాల నుండి తప్పించుకోలేరు.
- నేడు నెయ్యి కొనుగోలులో నాణ్యత-పారదర్శకతకు పెద్దపీట
- నేడు 62శాతం ఆవు నెయ్యి నందిని డెయిరీ టీటీడీ సరఫరా చేస్తున్నది.
- మదర్ డెయిరీకి 2 టెండర్లు, ఇండాపూర్‌కు 2 టెండర్లు, సంగంకు 1 టెండర్ మాత్రమే దక్కింది.
- ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఎన్‌డీడీబీ పరీక్షల్లో ఉత్తీర్ణత అయినవాటికే నెయ్యి సరఫరా ఆర్డర్లు.
- ఎన్‌డీడీబీ నిపుణుల సూచనల ప్రకారం నెయ్యి ధర టెండర్లు కేటాయింపులు జరిగాయి.



**- గురజాల మాల్యాద్రి,**
**చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

---

# తప్పుడు ఆరోపణలు ఉపసంహరించుకోవాలి

- **జగన్ ప్రేరేపణతోనే అసత్య ప్రచారం**
- **బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలి**
- **లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు**
- **బొత్సకు హెరిటేజ్ ఫుడ్స్ లీగల్ నోటీసులు**

అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు ప్రముఖ డెయిరీ సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ భారీ షాక్ ఇచ్చింది. తిరుమల లడ్డూ నెయ్యి వ్యవహారంలో సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా నిరాధారమైన ఆరోపణలు చేశారం టూ హెరిటేజ్ ఫుడ్స్ తరపు న్యాయవాది జి.మల్లికార్జునరావు లీగల్ నోటీసు జారీ చేశారు. ఫిబ్రవరి 18, 2026 నాటి 'సాక్షి' పత్రిక లో ప్రచురితమైన కథనం, అంతకు ముందు బొత్స నిర్వహిం చిన ప్రెస్‌మీట్ ద్వారా హెరిటేజ్ సంస్థపై తప్పుడు ప్రచారం చేశారని సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందాపూర్ డెయిరీతో సంబంధంపై స్పష్టతనిచ్చింది. బొత్స చేసిన ఆరోపణలను ఖండించింది. మహారాష్ట్రకు చెందిన ఇందాపూర్ డెయిరీ హెరిటేజ్ సంస్థదేనని.. దాని ద్వారానే



గతంలో టీటీడీ నెయ్యి కాంట్రాక్టులు పొందారని బొత్స చేసిన ఆరోపణలను హెరి టేజ్ ఖండించింది. ఇందాపూర్ డైరీకి, హెరిటేజ్ ఫుడ్స్‌కు మధ్య కేవలం ఒప్పంద తయారీ (Contract Manu facturing) సంబంధం తప్ప యాజమాన్య పరంగా ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. హెరిటేజ్ సంస్థ 22 కంపెనీలతో కలిసి 'సిండికేట్'గా ఏర్పడిందన్న బొత్స వ్యాఖ్యలు అత్యంత అపవాదుతో కూడుకున్నవని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని నోటీసులో పేర్కొన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రేరేపణతోనే, రాజకీయ లబ్ధి కోసమే ఈ తప్పుడు ఆరోపణలు చేశారని హెరిటేజ్ సంస్థ ఆరోపించింది. నాణ్యతకు మారుపేరుగా అనేక అంతర్జా తీయ అవార్డులు పొందిన తమ 33 ఏళ్ల చరిత్ర ఉన్న సంస్థ పరువు తీయడమే ధ్యేయంగా ఈ దుష్ప్రచారం సాగుతోందని పేర్కొంది. తప్పుడు ఆరోపణలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా బేషరతు క్షమాపణ చెప్పాలి. నోటీసు జారీ చేసినం దుకు గాను రూ.1,00,000 (అక్షరాలా లక్ష రూపాయలు) లీగల్ ఖర్చులు వెంటనే చెల్లించాలి. క్షమాపణ చెప్పని పక్షంలో బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 356 కింద పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నోటీసు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది.

---

## ప్రధాని మోదీతో సుందర్ పిచాయ్ భేటీ

దేశ రాజధాని దిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం పలువురు ప్రపంచ దేశాధినేతలు, పారిశ్రామిక దిగ్గజాలతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ముఖ్యంగా గూగుల్ ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్‌తో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ చేస్తున్న కృషి గురించి, అలాగే భారతీయ విద్యార్థులు, నిపుణులతో కలిసి గూగుల్ ఏఐ రంగంలో ఎలా ముందుకు సాగవచ్చనే అంశంపై ఆయనతో చర్చించారు. ఈ భేటీ తరువాత ప్రధాని మోదీ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను కలవడం సంతోషంగా ఉంది. ఏఐ రంగంలో భారత్ చేస్తున్న కృషి గురించి, అలాగే మన ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులు గూగుల్‌తో కలిసి పనిచేసే అవకాశాల గురించి చర్చించాం" అని పేర్కొన్నారు.

చైతన్యరథం







## ఆనందాలు నిండుగా..

# ఆత్మీయ పండుగ

### ప్రజా ప్రతినిధులు, కుటుంబసభ్యులకు మంత్రి నారా లోకేష్ విందు



ఉండవల్లి (చైతన్య రథం): ఆహ్వానితులంతా కుటుంబసమేతంగా తరలివచ్చారు. ఆ ఇంట.. పిల్లల కేరితలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. నిత్యమూ ఒకరినొకరు కలిసే ప్రజాప్రతినిధులే అయినా.. ఆతిథ్య పలకరింపులు.. ఆత్మీయ నవ్వులతో గంటల సమయం క్షణాల్లో గడచిపోయాయి. ఆనందాలు నిండుగా జరిగిన ఆత్మీయ పండుగకు ఉండవల్లిలోని విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ నివాసం వేదికైంది. కూటమి ప్రజాప్రతినిధులతో ఆత్మీయ విందు సమావేశాలు నిర్వహిస్తున్న లోకేష్ బుధవారం రాత్రి అనంతపురం, హిందూపురం పార్లమెంటు నియోజకవర్గాల పరిధి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కుటుంబాలు సహా ఆహ్వానించారు. విందు సమావేశం కుటుంబ వేడుకను తలపించేలా సందడిగా సాగింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అనే భేదాల్లేకుండా స్నేహపూర్వక సంభాషణలతో గడిపారు. కుటుంబసభ్యులను తీసుకురాని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని మంత్రి నారా లోకేష్ ఆట పట్టించారు. చిన్నారులను ఎత్తుకుని ముద్దాడి, హైఫైలు కొడుతూ లోకేష్ కూడా చిన్నపిల్లాడిలా సరదాగా గడిపారు.



ప్రజాప్రతినిధులకు ఒక ఫైల్‌ను సిబ్బంది అందజేశారు. అవి చూసిన ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు. తాము ఇచ్చిన వినతులు ఏవి పరిష్కారమయ్యాయో? ఏవి కాలేదో నివేదిక రూపంలో ఇచ్చిన మంత్రి లోకేష్ బాధ్యతాయుత సంస్కారాన్ని మెచ్చుకున్నారు. ఇంటికొచ్చిన సోదరీమణులందరికీ మంగళగిరి వీవర్‌శాల నుంచి తెప్పించిన పట్టుచీరలను లోకేష్ అందజేశారు.

అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మంత్రి పయ్యావుల కేశవ్ (ఉరవకొండ), ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), గుమ్మనూరు జయరాం (గుంతకల్లు), జేసీ అస్మిత్ రెడ్డి (తాడిపత్రి), బండారు శ్రావణిశ్రీ (సింగనమల), దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ (అనంతపురం అర్బన్), అమిలినేని సురేంద్రబాబు (కళ్యాణ దుర్గం), హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, మంత్రి సవిత (పెనుకొండ), మంత్రి సత్యకుమార్ (ధర్మవరం-బీజేపీ), ఎంఎస్ రాజు (మడకశిర), పల్లె సింధూరరెడ్డి (పుట్టపర్తి), కందికుంట వెంకటప్రసాద్ (కదిరి), పరిటాల సునీత (రాప్తాడు)లు కుటుంబసభ్యులతో లోకేష్ ఆత్మీయ విందుకు హాజరయ్యారు.











## సీఎం చంద్రబాబు రంజాన్ శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): పవిత్ర రంజాన్ మాసం ఆరంభం సందర్భంగా ముస్లిం సమాజానికి సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. 'దివ్య ఖురాన్ అవతరించిన ఈ పవిత్ర మాసంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఉపవాస దీక్షలు, ప్రతినిత్యం ప్రార్థనలు, పేదలకు దానధర్మాలు చేస్తూ, ఆధ్యాత్మిక చింతనతో నియమనిష్ఠలతో ముందుకు సాగుతారు. వారి దీక్ష పవిత్రంగా సాగాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## ముస్లిం సోదరులకు లోకేష్ రంజాన్ శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): దివ్య ఖురాన్ అవతరించిన పవిత్ర రంజాన్ మాసం ఆరంభమైన సందర్భంలో ముస్లిం సోదరులకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "నెలవంక కనిపించడంతో ఆరంభమైన రంజాన్ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులు శుభాకాంక్షలు. తరావీహ్ నమాజ్, ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో నెలంతా సాగాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను" అని లోకేష్ పేర్కొన్నారు.



## క్రైస్తవులకు మంత్రి లోకేష్ లెంట్ శుభాకాంక్షలు


అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని క్రైస్తవ సోదర సోదరీమణులకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ లెంట్ సీజన్ శుభాకాంక్షల తెలిపారు. ఈమేరకు బుధవారం ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. 'క్రైస్తవులకు ఆశీర్వాదకరమైన, అర్థవంతమైన లెంట్ సీజన్ శుభాకాంక్షలు. 40 రోజులపాటు ఉపవాసం, యేసు ప్రార్థనలతో గడిపే సమయంలో విశ్వాసం, కరుణ అందాలని ఆకాంక్షిస్తున్నాను' అని పేర్కొన్నారు.






# ఐఎఫ్ఆర్ చిత్రమాలిక



















# 22ఏ నుంచి ప్రైవేటు భూముల తొలగింపు సరళతరం

- **ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో కలిసి ప్రత్యేక డ్రైవ్**
- **పేదలకు లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకున్నాం**
- **అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో 22ఎ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే ప్రక్రియను మరింత సరళతరం చేస్తామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే కొలికలపూడి శ్రీనివాసరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భూ ఆక్రమణ, 22ఎ జాబితా నుంచి తొలగింపు అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సమాధానమిస్తూ 22ఎ నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూములను తొలగించేందుకు ఇప్పటికే మెమోను జారీ చేశామని, ఇందులో ఐదు రకాల భూము లను నిషేధిత జాబితా నుంచి తొలగించే అవకాశాన్ని కల్పించా మని చెప్పారు. ఈ సందర్భంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కలు గజేసుకుని 22ఎ నిషేధిత భూముల సమస్య రాష్ట్రమంతా ఉందని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం కూడా మంచి మార్గదర్శకాలు కూడా ఇచ్చిందని, ఇవి అమలయ్యేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందిస్తూ 22ఎ



నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూముల తొలగింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తామన్నారు. తమ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తాను, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ ఒక టీమ్‌గా ఏర్పడి 22ఏ భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తు న్నామని చెప్పారు. పేదలకు లబ్ధి జరిగేలా సామాన్యులు నష్టపో కుండా ఉండేలా 22ఎ నిషేధిత భూముల సమస్యను పరిష్క రించమని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మార్గనిర్దేశం చేశా రని, తాము ఆ దిశగా పని చేస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో 22ఏ భూముల తొలగింపునకు ఇచ్చిన ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక డ్రైవ్ చేపడతారని చెప్పారు. తిరువూరు మండలంలోని రామన్న పాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 22లో ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రశ్న అడగగా ఆ భూములకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయని, కోర్టు తీర్పు వచ్చేంతవరకు ఎదురు చూడాల్సి ఉందన్నారు. అలాగే విశాఖలో మాజీ సైనికోద్యోగులకు అసైన్డ్ చేసిన భూముల అమ్మకాలకు సంబంధించి బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూములను పదేళ్ల తర్వాత వారు, వారి వారసులు అమ్ముకోవచ్చని తెలిపారు. అయితే అలా కేటాయించిన భూముల్లో నీటి వనరులు ఉంటే కొన్ని సుప్రీం కోర్ట్, హైకోర్టు తీర్పుల రీత్యా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని సమాధానమిచ్చారు. అందుకే వాటిని నిషేధిత జాబితా లో పెట్టినట్లు తెలిపారు.

### నూజివీడు నియోజకవర్గ ప్రగతిపై

# మంత్రి పార్థసారథి వరుస సమీక్షలు

- **బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల పరిస్థితులపై మంత్రి ప్రత్యేక ఆరా**
- **నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై సీరియస్**
- **నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పరిస్థితులపై సమీక్ష**
- **మందుల పంపిణీ, మౌలిక వసతులు, పారిశుధ్యం అంశాలపై స్పెషల్ ఫోకస్**
- **ప్రజలకు వైద్యం విషయంలో ఇబ్బందివస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆసుపత్రి సిబ్బందికి వార్నింగ్**
- **ఉలిక్కిపడుతున్న ఇతర శాఖల అధికారులు**



నూజివీడు (చైతన్యరథం): రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు నియోజకవర్గ ప్రగతిపై ఫోకస్ పెంచారు. అన్ని శాఖలపై వరుస సమీక్షలతో బిజీబిజీగా గడుపుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు సీరియస్ వార్నింగులే ఇస్తున్నారు. తీరు మార్చుకోకపోతే వేటు తప్పదని నిర్మొహమాటంగా ముఖం మీదే చెప్పేస్తున్నారు. తాజాగా బుధవారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఎస్టీ, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్, నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి, నియోజకవర్గంలోని పీహెచ్‌సీలపై ఆకస్మిక రివ్యూ నిర్వహించారు. ప్రజల సంతృప్తిని ప్రామాణికంగా తీసుకుంటూ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ విషయాన్ని అధికారులు గ్రహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుదరదన్నారు.

**గిరిజన విద్యార్థులంటే అంత నిర్లక్ష్యమేంటి?**

నూజివీడులోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం, బోధనకు సంబంధించిన అంశాలపై వార్డెన్‌ను మంత్రి ఆరా తీశారు. కొన్ని ముఖ్యమైన విషయాలకు వార్డెన్ సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలాడు. హాస్టల్‌లో గిరిజన విద్యార్థుల సంఖ్య తగ్గడమేంటి? మీరు నిజంగా చిత్తశుద్ధితో పనిచేస్తే విద్యార్థుల సంఖ్య ఎందుకు పెరగదు? ఉద్యోగాలు చేస్తున్నారా, ఆడుకుంటున్నారా? మీరు సరిగ్గా పనిచేస్తే హాస్టల్‌వైపు గిరిజన విద్యార్థులు తప్పకుండా వస్తారు... అంటూ వార్డెన్ నిర్లక్ష్యంపై మంత్రి నిప్పులు చెరిగారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి ఫోన్ చేసి వార్డెన్ నిర్వాకాన్ని వివరించారు. తక్షణం నూజివీడు నియోజకవర్గంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్ల పరిస్థితులపై దృష్టి పెట్టాలని జిల్లా అధికారిని ఆదేశించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఎవ్వరినీ వదిలిపెట్టే పరిస్థితి ఉండదని వార్నింగ్ ఇచ్చారు.

**బీసీ హాస్టళ్లపై అసంతృప్తి ఎందుకు పెరుగుతుంది?**

నూజివీడు నియోజకవర్గంలోని బీసీ వెల్ఫేర్ హాస్టళ్ల నిర్వహణ, భోజనం, వసతులు, బోధనకు సంబంధించిన అంశాల్లో ప్రజల్లో సంతృప్తి శాతం ఎందుకు తగ్గుతుందో సమాధానం చెప్పాలని మంత్రి వార్డెన్లను నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లు ఎవరినైనా సరే తక్షణం సస్పెండ్ చేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని మంత్రి ఆదేశించారు. బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో అసలు ఏం జరుగుతోందో కనుక్కుని, అక్కడి పరిస్థితులను పరిశీలించి, చక్కదిద్దాల్సిన అంశాలను తన దృష్టికి తీసుకురావాలని జిల్లా అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి విషయంలో ప్రజల్లో సంతృప్తి స్థాయి ఎట్టి పరిస్థితుల్లోనూ పెరగాల్సిందేనని సూపరింటెండెంట్, వైద్యులకు మంత్రి పార్థసారధి హుకుం జారీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ, పారిశుధ్యం, మౌలిక వసతులు, మందుల పంపిణీ, రోగుల పట్ల వైద్యుల ప్రవర్తన తీరు, వైద్యం చేసే విధానాల్లో మార్పు రాకపోతే చర్యలు తప్పవని సంబంధిత సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి ఏమైనా అవసరమైతే చెప్పాలని, సంబంధిత సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి పేర్కొన్నారు. నూజివీడు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వైద్యశాలల్లో కూడా ప్రజలకు మంచి వైద్యం అందాలని, పేషెంట్లను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఆసుపత్రిలో ఏ ఇబ్బంది ఉన్నా ఉన్నతాధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసేలా కంప్లయింట్ బాక్సులు, ఉన్నతాధికారుల అఫీషియల్ నంబర్లు డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు.

# హెరిటేజ్ ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర

### 34 ఏళ్ల విశ్వసనీయతకు మచ్చ తెచ్చే ప్రయత్నం

**వైసీపీ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు - ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ**

అమరావతి(చైతన్యరథం): 34 ఏళ్ల నిష్కళంక చరిత్ర కలిగిన హెరిటేజ్ సంస్థపై మచ్చ వేయడానికి వైసీపీ ప్రయత్నిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మండిపడ్డారు. రు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమా వేశంలో ఆమె మాట్లాడారు. గత రెండురోజులుగా శాసన మండలిలో చైర్మన్ వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సంబంధం లేని కంపెనీల గురించి సభలో చర్చించడం వల్ల సభా సమయం వృథా అవుతుందని విమర్శించారు. సంబం ధం లేని సంస్థల చరిత్రను ప్రస్తావిస్తూ వాటిని దూషించడం వైసీపీ నాయకుల తీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. హెరిటేజ్ సంస్థ 34 సంవత్సరాలుగా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ విశ్వసనీయతను సంపాదించుకుందని తెలిపారు. 15 రాష్ట్రాల్లో హెరిటేజ్ వ్యాపారాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగుతున్నాయని, ఎక్కడా సంస్థపై చిన్నపాటి మచ్చ కూడా లేదని స్పష్టం చేశారు. హెరిటేజ్ సంస్థకు గోల్డెన్ పీకాక్ అవార్డు లభించడం దాని ప్రతిష్టకు నిదర్శనమని, ఇటీవల భువనేశ్వరి ఆ అవార్డును స్వీకరించారని గుర్తుచేశారు. మండలిలో పదేపదే ఇందాపూర్ డెయిరీ అంశాన్ని ప్రస్తావించడం అవగాహనలేమికి సంకేతమని తెలిపారు. వైసీపీకి కనీస అవగాహ న ఉంటే ఇలాంటి ఆరోపణలు చేయరని వ్యాఖ్యానించారు.

జగన్ అనేక కేసుల్లో మనీ లాండరింగ్ కేసులో కూడా ఇరుక్కుని ఉన్నా రని వ్యాఖ్యానించారు. వ్యాపార విధానాలు ఎలా ఉంటాయో జగన్‌కు అవగాహన లేదని విమర్శించారు. ఇందాపూర్ డెయిరీ ఒక కో-మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మాత్రమేనని, దానిని హెరిటేజ్‌లో భాగమని చెప్పడం సరైనది కాదని తెలిపారు.

ఒక సంస్థ తయారు చేసిన ఉత్పత్తులను మరో సంస్థ వినియోగించడం సాధారణమేనని..ఉదాహరణగా టయోటా, మారుతీ సుజుకీ సంస్థ లను ప్రస్తావించారు. అలాగే టైమ్స్ ఆఫ్ ఇండియా కో-ప్రింటింగ్ సాక్షి ప్రింటింగ్ ప్రెస్‌లో జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధం లేకుండా ఇందాపూర్ డెయిరీ అంశాన్ని లేవనెత్తడం తగదని పేర్కొన్నారు. ఇటీవల టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆ



అంశాన్ని పక్కనపెట్టి లేనిపోని విషయా లను పెద్దదిగా చూపించే ప్రయత్నం వైసీపీ నాయకులు చేస్తున్నా రని మండిపడ్డారు.

# మేం చర్చకు సిద్ధం

- టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై హోంమంత్రి అనిత
- ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్



అమరావతి (చైతన్య రథం): టీటీడీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై తాము చర్చకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని, ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు సవాల్ విసిరారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి అనిత మాట్లాడారు.

టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని, రసాయనాల మిశ్రమమని చెప్పిందని పేర్కొన్నారు. గతంలోనూ పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ 34 ఏళ్లుగా ఉన్న సంస్థ అని,హెరిటేజ్‌నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధన పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు.

**సభలో రాద్ధాంతం చేస్తే కుదరదు**

వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని, ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణలేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వెల్లివిరిసిన బాలల ఉత్సాహం





- చట్టసభల పనితీరును పరిశీలించిన విద్యార్థులు
- త్వరలో పోలవరం సందర్శనకు అవకాశం..
- విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని సభాపతి పిలుపు

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికగా బుధవారం విద్యార్థుల ఉత్సాహం కనిపించింది. భావిభారత పౌరులైన విద్యార్థులకు చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య విలువలు, చట్టాల రూపకల్పన ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు చేపట్టిన పర్యటనలో సుమారు 300మంది విద్యార్థులు హాజరయ్యారు. గత ఆరు రోజులుగా కొనసాగుతున్న విజ్ఞాన యాత్రలో భాగంగా ఇప్పటివరకు దాదాపు 1400మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించడం విశేషం. సభలో ప్రజా సమస్యలపై జరిగే చర్చలను, సభా వ్యవహారాలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. సభా విరామ సమయంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్వయంగా విద్యార్థుల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు ఆయన ఓపికగా సమాధానాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీని వీక్షించిన విద్యార్థులకు త్వరలోనే పోలవరం ప్రాజెక్టును కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఉద్యోగం చేస్తే కుటుంబానికే పరిమితం అవుతారని, రాజకీయాలలోకి వస్తే ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందని ఉద్బోధించారు. నియోజకవర్గాలవారీగా వచ్చిన విద్యార్థులతో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, అమ్మిశెట్టి సురేంద్రబాబు, వెనిగండ్ల రాము, సుందరపు విజయ్‌కుమార్, బొమ్మిడి నాయకర్, బండారు శ్రావణి, యార్లగడ్డ వెంకటరావు తదితరులు పాల్గొని విద్యార్థులను ఆత్మీయంగా పలకరించారు. చట్టసభల వాతావరణాన్ని నేరుగా చూడటం తమకు ఎంతో జ్ఞానాన్ని, కొత్త స్ఫూర్తిని ఇచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# కులవర్ధన్ ఆత్మహత్య..

- మదనపల్లి బాలిక హత్య కేసులో కీలక పరిణామం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



మదనపల్లి (చైతన్య రథం); మదనపల్లి పట్టణంలో సంచలనం సృష్టించిన చిన్నారి అత్యాచారం, హత్య కేసులో నిందితుడు మృతి చెందినట్టు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం మీడియాకు వెల్లడించారు. ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కనసానివారిపల్లె చెరువులో బుధవారం నిందితుడు కులవర్ధన్ మృతదేహం లభ్యమైందని వెల్లడించారు. ప్రాథమిక విచారణ అనంతరం నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. నిందితుడు మరణించినప్పటికీ, కేసులోని ఆధారాలను సేకరించే ప్రక్రియ కొనసాగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లాలో ఇటువంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించామని, నివేదిక అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ యం వెంకటాద్రి, మదనపల్లి డిఎస్పీ యస్ మహేంద్ర, పలువురు సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 24 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడలు

- ట్రోఫీలు, ఏర్పాట్లపై స్పీకర్ అయ్యన్న సమీక్ష



అమరావతి(చైతన్యరథం): ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించనున్న ప్రత్యేక క్రీడా పోటీలను ఈ నెల 24, 25, 26 తేదీ ల్లో జరపాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నిరంతరం రాజకీయ ఒత్తిళ్లలో ఉండే ప్రజాప్రతినిధులకు మానసిక ఉల్లా సాన్ని పంచేలా ఈ క్రీడోత్సవం ఉండే ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలతో కలిసి ఆయన చర్చించా రు. ఈ సమావేశంలో ప్రధానంగా క్రీడల ఎంపిక, విజేతలకు అందించే ట్రోఫీలు, ప్రత్యేక క్రీడా దుస్తుల (జెర్సీల)పై లోతుగా చర్చించారు. పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, క్రికెట్, టెన్నికాయిట్, త్రో బాల్, టగ్ ఆఫ్ వార్, షటిల్ బ్యాడ్మింటన్, షాట్ పుట్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్, పికిల్ బాల్ వంటి క్రీడలను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపైనా దృష్టి సారించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు గణబాబు, కాల్వ శ్రీనివాస్, ఆదిరెడ్డి శ్రీనివాస్, సుందరపు విజయ్‌కుమార్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తదితరులు పాల్గొన్నారు. క్రీడల నిర్వహణ విజయవంతం చేయ డానికి వారు పలు సూచనలు చేశారు.

## పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం

- 18 ఏళ్లు నిండిన యువతకు
- ఏడాదిలో నాలుగుసార్లు ఓటు నమోదుకు అవకాశం
- కేంద్ర చట్టంతో అనుసంధానం చేస్తూ నిర్ణయం
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి కందుల దుర్గేష్



అమరావతి (చైతన్యరథం): శాసనసభలో పంచాయతీరాజ్ సవరణ బిల్లు - 2026కు ఏకగ్రీవ ఆమోదం లభించింది. ఉప ముఖ్యమంత్రి, పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖామాత్యులు కొణిదల పవన్‌కళ్యాణ్ తరపున పర్యా టక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ బిల్లును సభలో ప్రవే శపెట్టారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులందరూ బిల్లును స్వాగతించారు. బిల్లులోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే గతంలో పంచాయతీ రాజ్ సంస్థల్లో ఓటుహక్కు పొందడానికి కేవలం జనవరి 1వ తేదీని మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. దీనివల్ల జనవ రి 2న 18 ఏళ్లు నిండిన యువత మరో ఏడాది వేచి చూడాల్సి వచ్చేది. తాజా సవరణ ప్రకారం ఏడాదికి నాలుగు సార్లు (జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1) ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కేంద్ర చట్టం ఇప్పటికే ఈ నాలుగు తేదీల విధానాన్ని అమలు చేస్తోంది. మున్సిపాలిటీల్లో కూడా ఇదే విధానం ఉంది. ఇప్పుడు పంచాయతీరాజ్ సంస్థలను కూడా వీటికి అనుసంధానించడం ద్వారా రాష్ట్రంలో ఒకే విధమైన ఓటర్ల జాబితా విధానం అమల్లోకి వస్తుంది. ఇప్పటికే ముఖ్య మంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం డిసెం బర్ 23, 2025న ఈ అంశంపై ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తు తం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనికి శాసనసభ చట్టబద్ధత కల్పించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు లోకం నాగ మాధవి (నెల్లిమర్ల), ఎన్.ఈశ్వరరావు (ఎచ్చెర్ల),గోరంట్ల బుచ్చయ్య చౌదరి (రాజమహేం ద్రవరం రూరల్) పాల్గొ న్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలను తొలగించి పారదర్శకమైన జాబితాను రూపొందించాలని వారు సూచించా రు. సభ్యుల సూచనలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. సభ్యులందరి ఆమోదంతో రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు - 2026 ఆమోదం పొందినట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రకటించారు.

# ఉభయగోదావరి జిల్లాల్లో డ్రైనేజ్ సమస్యపై సర్వే

- సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం
- పంట నష్టాలపై రైతులకు న్యాయం చేస్తాం
- దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు సాయానికి ప్రతిపాదన
- అసెంబ్లీలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి(చైతన్యరథం): అసెంబ్లీ సమావేశాల్లో రాజోలు ఎమ్మెల్యే దేవా వరప్రసాద్ రాజోలు నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న డ్రైనేజ్ సమస్యలపై ప్రశ్నించారు. డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గత, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 6000 ఎకరాల్లో పంటలు మునిగిపోయి రైతులు తీవ్ర నష్టాలు ఎదు ర్కొం టున్నారని వెల్లడించారు. ప్రభావిత రైతులకు తక్షణ నష్టపరి హారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే సముద్ర మట్టం పెరుగుదల, భూమి కుంగిపోవడం, డ్రైనేజ్ నీటిలో ఉప్పు శాతం పెరగడం వంటి కారణాల వల్ల సుమారు లక్ష ఎకరాలకు పైగా కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయని, వేలాది కొబ్బరి చెట్లు ఎండిపోయి పాడైపోయాయని పేర్కొన్నారు. టెక్నికల్ కమిటీ నివేదికల ఆధా రంగా ఈ సమస్యను ప్రకృతి విపత్తుగా గుర్తించి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. లైడార్ సర్వే కూడా జరుగుతోందని తెలిపారు. దీనికి సమాధానంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ ఉభయగోదా వరి జిల్లాల్లో డ్రైనేజ్ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా డ్రైనేజ్ అభివృద్ధికి ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించిం దని పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రాజెక్ట్ రూపంలో తీసుకుని సర్వే చేయడానికి రూ.17 కోట్లు విడుదల చేశామని, సర్వే పూర్తి చేసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి బ్యాంకుల సహకారంతో సమగ్ర చర్యలు చేపడతా మని హామీ ఇచ్చారు. కొబ్బరి తోటల నష్టంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్వయంగా ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, నిపుణుల బృందంతో పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. రైతులకు తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. మల్కీపురం, మామిడి కుదురు మండలాల పరిధిలోని కేసనపల్లి, శంకరగుప్తం తదితర గ్రామాల్లో పెద్దఎత్తున కొబ్బరి చెట్లు ఎండిపోయినట్లు నివేదికలు అందాయని పేర్కొన్నారు. దాదాపు ఒక లక్ష కొబ్బరి చెట్లు పాడైపో యిన నేపథ్యంలో ప్రతి చెట్టుకు రూ.1,000 చొప్పున మొత్తం రూ.10 కోట్లు ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్యానవన శాఖ ప్రతిపాదనలు సమర్పించిందని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాద నలు ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపినట్లు వెల్లడించారు. దీర్ఘకాలిక పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం "శంకరగుప్తం మేజర్ డ్రైన్ ఆధునికీకరణ" పనులకు రూ.20.77 కోట్లు మంజూరు చేసిందని, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అదనంగా కోకోనట్ డెవల ప్‌మెంట్ బోర్డు ద్వారా R&R (Replanting & Reju venation) పథకం కింద హెక్టారుకు రూ.32,500, అలాగే పాత మొక్కలు తొలగించడానికి కొత్త మొక్కలు వేయడానికి ప్రతిపాదనలు తయారుచేస్తున్నాం. వీబీ-జీ-రామ్-జీ (ఉపాధి హామీపథకం) పథకం ద్వారా ఉద్యానవన (కొబ్బరి) తోటలు పథకంలో భాగంగా పాతవి తొలగించి కొత్తవి నాటటం కోసం ఎకరాకు గరిష్ఠంగా రూ.99,181 వరకు ఆర్థిక సాయం అందిం చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. రైతులకు ఏ పథకం ద్వారా అధిక ప్రయోజనం కలుగుతుందో దానిని అమలు చేస్తామని స్పష్టం చేశారు.

## బస్సులపై రోడ్ ట్యాక్స్, పర్మిట్ ఫీజులు తగ్గించాలి

**మంత్రికి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వినతి**



విజయవాడ (చైతన్యరథం): కాంట్రాక్ట్ క్యారేజ్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బస్సులపై విధిస్తు న్న రోడ్ ట్యాక్స్, పర్మిట్ ఫీజులను తగ్గించాలని వినతిపత్రం అంద జేశారు. పన్నుల తగ్గింపుతో బస్సుల రిజిస్ట్రేషన్లు ఆంధ్రప్రదేశ్‌కు తిరిగిరావడంతో పాటు రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందని ప్రతినిధులు వివరించారు. వినతిని స్వీకరించిన మంత్రి పరిశీలిం చి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ వీ.సంబిరెడ్డి, సభ్యులు ఉన్నారు.

## చప్రాసీ పదం తొలగింపు

- మున్సిపల్ చట్టం సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- వీఎల్‌టిని 50 శాతానికి తగ్గిస్తూ సవరణ బిల్లు
- రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టిన మంత్రి నారాయణ



అమరావతి (చైతన్య రథం): మున్సిపల్ శాఖకు సంబంధించిన రెండు కీలక సవరణ బిల్లులకు అసెంబ్లీ ఆమోదముద్ర వేసింది. వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ సగానికి తగ్గించే బిల్లుకు, చప్రాసీ పదాన్ని తొలగిస్తూ తీసుకొచ్చిన సవరణ బిల్లును ఆమోదించింది. ఈ రెండు బిల్లులను మంత్రి నారాయణ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. స్వల్ప చర్చ అనంతరం రెండు బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్ శాఖలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించేలా చట్ట సవరణ చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. నరెడ్కో, క్రెడాయ్‌తో పాటు వివిధ సంఘాలు ఇచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని బిల్డర్లను ప్రోత్సహించడం, భవన నిర్మాణ రంగంలో పారదర్శకత తీసుకొచ్చేలా మున్సిపల్ చట్టాల్లో మార్పులు తీసుకొచ్చామన్నారు. భవన నిర్మాణ సమయంలో ఖాళీ స్థలం పన్ను విధించడంవల్ల బిల్డర్లు, డెవలపర్స్‌పై అదనపు ఆర్థిక భారం పడుతుందనే విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చినట్లు మంత్రి చెప్పారు. దీంతో ఈ పన్ను (వీఎల్‌టి) 50 శాతానికి తగ్గిస్తూ చట్ట సవరణ చేసామని మంత్రి చెప్పారు. దీని ప్రకారం భవన నిర్మాణ అనుమతి పొందినప్పటి నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చే వరకు లేదా భవనం పూర్తయిన తేదీ లేదా అట్టి అనుమతి చెల్లుబాటు ముగిసే వరకూ లేదా దానిని పొడిగించిన చెల్లుబాటు తేదీ ఏది ముందు అయితే అప్పటివరకూ ఖాళీ స్థలం పన్నులో 50శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు.

**దేవాదాయ చట్టంలోనూ..**

దేవాదాయ శాఖకు సంబంధించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రవేశపెట్టిన రెండు సవరణ బిల్లులకు శాసన సభ ఆమోదం లభించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం చప్రాసీ పదాన్ని దేవాదాయ చట్టం నుంచి తొలగిస్తూ.. సవరణ బిల్లును మంత్రి ప్రతిపాదించారు. స్వల్పకాల చర్చ అనంతరం రెండు సవరణ బిల్లులను శాసనసభ ఆమోదించింది.

## జిల్లా రిజిస్ట్రార్లుగా సబ్‌రిజిస్ట్రార్లు

**- 18 మంది పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు**

రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖలో 18 మంది సబ్ రిజిస్ట్రార్లకు జిల్లా రిజిస్ట్రార్లుగా పదోన్నతి లభించింది. వీరికి పోస్టింగులు ఇస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.పార్వతి (పార్వతీ పురం మన్యం జిల్లా), బి.అశోక్ (నంద్యాల జిల్లా), పి. శ్రీనివాస రావు (బాపట్ల), పీవీవీ దుర్గాప్రసాద్ (ఎన్టీఆర్), జి. శ్రీరామ్‌కు మార్ (తిరుపతి), జి.శివయ్య (పశ్చిమగోదావరి), సి. కుమార స్వామిరెడ్డి (శ్రీకాకుళం), బి.విజయభాస్కర్ (చిత్తూరు), ఎం.సూర్యనారాయణ (ఏఐజీ- ఐజీ కార్యాలయం), ఎం.రవి జోసెఫ్ (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు), ఎస్కే ప్రవీణ్‌బాబు (కర్నూలు ఎంవి/ఐ), బి.ప్రసన్నలక్ష్మి (ఏఐజీ-ఐజీ కార్యాలయం), పీవీ రమాపతిరావు (ఏలూరు), సీహెచ్.నరసింహమూర్తి (అల్లూ రి సీతారామరాజు), కె.ప్రసాదరావు (కాకినాడ), వై.బర్భూరి (కర్నూలు), కె.జగన్మోహన్‌రావు (తూర్పుగోదావరి), ఎస్.మోహన రావు (విజయనగరం)లను జిల్లా రిజిస్ట్రార్లుగా నియమించారు.

## అసెంబ్లీకి రారు.. శాసనమండలిలో రాద్ధాంతం చేస్తారు

- వైసీపీ నేతలకు ప్రజలంటే లెక్కలేదు, దేవుడంటే భయం లేదు, కుటుంబమంటే నమ్మకం లేదు
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి (చైతన్యరథం): 'వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రారు... వచ్చినా సభను జరగనివ్వరు. విలువైన సమయాన్ని వృథా చేయడమే వారి పని..' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారం ఆమె మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పలు విషయాలను ప్రస్తావించారు. 'శాసన మండలిలో సభా సమయాన్ని కావాలనే వృథా చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి... బిల్‌గేట్స్ టీ-సమోసా ఖర్చులపై చర్చించడమేమిటని మండిపడ్డారు. ప్రజా సంక్షేమంపై ఎలాంటి చర్చకైనా ప్రభుత్వం సిద్ధమన్నారు. దేవుడిని కూడా రాజకీయానికి వాడుకుంటున్నారన్నారు. వైసీపీ నేతలకు ప్రజలంటే లెక్కలేదు... దేవుడంటే భయం లేదు.. కుటుంబమంటే నమ్మకం లేదన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నెయ్యి కల్తీ జరిగిందని సీబీఐ ఆధ్వర్యంలోని 'సిట్' తేల్చింది. దేవుణ్ని కూడా రాజకీయంగా వాడుకోవడానికి వైసీపీ సిద్ధంగా ఉంది.. దేవుడిపై భక్తి లేని ఆ పార్టీ నేతలు రాజకీయాలు చేస్తున్నారు. తాము చేసిన తప్పులను పక్కవారిపై నెట్టడం వైసీపీ నేతలకు అలవాటన్నారు. ప్రభుత్వంపై బురద చల్లడమే వైసీపీ పని. ఆ పార్టీ ఎమ్మెల్సీలకు ప్రజా సమస్యలపై చర్చించే ఆలోచన లేదన్నారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2024 నుంచి నెయ్యి కొనుగోలులో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తామన్నారు. రవాణాలో నెయ్యి నాణ్యత దెబ్బతినకుండా సేకరిస్తామని, నెయ్యి ట్యాంకర్లకు జీపీఎస్ లాక్ సిస్టమ్ అమలు చేస్తామన్నారు. డెయిరీల తయారీ సామర్థ్యానికి ఎంఆర్‌ఎల్ స్కోర్ల విధానం తెస్తామన్నారు. నాణ్యత పరీక్షల్లో ఐఎస్ఓ, ఐఎస్ కోడ్‌లను కఠినంగా అమలు చేస్తామన్నారు. 2024–25 మధ్య ఏడు విడతల టెండర్లు పిలిచి 65 లక్షల కిలోల నెయ్యి సేకరిస్తామన్నారు. గుత్తాధిపత్యానికి తావివ్వకుండా పారదర్శక టెండర్లు పిలుస్తామన్నారు. అర్హత సాధించిన డెయిరీలకే ఆర్డర్లు ఇస్తామన్నారు. నందిని డెయిరీని తప్పించారన్న ప్రచారం అసత్యం అన్నారు. ఏడు టెండర్లలో నాలుగు 'నందిని'కే దక్కాయన్నారు. ఇందాపూర్ డైరీకి మాత్రమే టెండర్లు అన్నది అబద్ధమని, ఇతర డెయిరీలకు కూడా సమాన అవకాశం ఇచ్చామన్నారు. టీటీడీ ప్రసాదాల పవిత్రత కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

# అసెంబ్లీ ఆవరణలో 'ఆప్కో' స్టాళ్లు


- బడ్జెట్ సమావేశాల ముగిసే వరకూ నిర్వహణ
- ప్రఖ్యాత గాంచిన చేనేత వస్త్రాల విక్రయం
- నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, బజా ర్లు, వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. పండగ సమయాల్లో భారీ డిస్కౌంట్లు అందజేస్తూ చేనేత వస్త్రాల వినియో గం పెంచడంతో పాటు నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించ డమే కాకుండా ఆదాయం ఆర్జించేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పా టు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, శాసనమండలికి వస్తున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచే లక్ష్యంతో గురువారం నుంచి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను చేనేత, జౌళి శాఖాధికారు లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తయారవుతున్న ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఈ స్టాళ్లలో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు షర్ట్‌లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు ఇంటిళ్లపాది వినియోగించుకునే రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నారు. లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం అమ్మకానికి పెట్టనున్నా రు. గురువారం ఈ స్టాళ్లను ప్రారంభించి, అమ్మకాలు ప్రారంభించ నున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీర లను అమ్మకానికి పెట్టాలని చేనేత, జౌళి శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశించారు.

### చేనేత అమ్మకాలు పెంచడమే లక్ష్యం

నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికంగా భరోసా కల్పించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభు త్వం వచ్చిన నాటి నుంచి చేనేత వస్త్రాల అమ్మకం, వినియోగం పెంచేలా చేనేత ఎగ్జిబిషన్లు, బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలి పారు. ఏ చిన్న వేడుక, పండుగ వచ్చినా ప్రత్యేక డిస్కౌంట్లతో చేనేత దుస్తుల అమ్మకాలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో 12 చేనేత స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం నుంచి వచ్చే నెల ఏడో తేదీ వరకూ ఈ స్టాళ్లు నిర్వహిస్తామన్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచడమే లక్ష్యంగా ఈ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించా రు. బడ్జెట్ సమావేశాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో వస్తుంటారు. వారంతా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయ డం ద్వారా నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. ప్రజలంతా వారంలో ఒకరోజు చేనేత దుస్తులు ధరించడం ద్వారా సంప్రదా యమైన చేనేత వృత్తికి వెన్నుదన్నుగా నిలిచేవారవుతారని తెలిపారు.



# విస్తరణలో తొలగించిన చెట్లనూ సంరక్షిస్తున్నాం

- పర్యావరణం, పచ్చదనానికి ప్రాధాన్యం
- అసెంబ్లీలో మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి

అమరావతి(చైతన్యరథం): అసెంబ్లీలో బుధవారం యలమంచి లి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అడిగిన ప్రశ్నకు ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమాధానమిచ్చారు. గతంలో జగ న్‌రెడ్డి ఒక్క రోజు మీటింగ్ కోసం వందల ఏళ్ల నాటి మొక్కలను నరికివేసిన దుస్థితి. కూటమి ప్రభుత్వంలో వన సంరక్షణ వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణం- పచ్చదనానికి ప్రాధాన్యం కల్పి స్తున్నాం. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల విస్తరణ పను లు చేపట్టేటప్పుడు రోడ్ల విస్తరణ భాగంలో అడ్డు వచ్చే చెట్లను మాత్రమే తొలగిస్తున్నాం. జాతీయ రహదారుల పచ్చదనం కోసం సివిల్ పనుల ఖర్చులో ఒక శాతం, హైవేల వెంబడి మొక్కల పెంపకం, నిర్వహణ కోసం కేటాయించబడుతుంది. ఈ మార్గ దర్శకాల ప్రకారం రోడ్డు మధ్య భాగంలో రహదారి రెండు వైపులా అవెన్యూ మొక్కల నాటడం వంటి పనులు చేపట్టాలి. రాష్ట్ర రహదా రులకు సంబంధించి రైట్ ఆఫ్ వే భూమి అందుబాటులో ఉన్న చోట రోడ్డుకు ఇరువైపులా చెట్ల పెంపకం జరుగుతోంది. రైట్ ఆఫ్ వే అందుబాటులో లేని పక్షంలో అటవీ శాఖ అమలులో ఉన్న మార్గదర్శకాల ప్రకారం అటవీకరణ కోసం గుర్తించిన భూములలో మొక్కల పెంపకం జరుగుతోంది. ఇంకా ఏళ్ల తరబడి ఉన్న చెట్లు, భారీ చెట్లను ఇతర ప్రాంతాలకు మార్చి నాటుటకు చర్యలు తీసుకు న్నాం. యలమంచిలి నియోజకవర్గంలోనే దాదాపు 18 చెట్లను నాటాం. గతంలో సచివాలయానికి వచ్చే రహదారిలో చెట్లన్నీ ఎండిపోయిన పరిస్థితి.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటి ని సంరక్షించుకుంటున్నాం. సీఎం, డిప్యూటీ సీఎం సూచనల మేరకు రహదారులకు ఇరువైపులా చెట్లు పెంచుతూ పచ్చ దనానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

# రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భూ ఆక్రమణ

- వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- రూ.8 కోట్ల ఆస్తిని రూ.10 లక్షలకు
- నొక్కేసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని వర్గీయులు
- ఫోర్జరీ పత్రాలతో వారసత్వ భూమి మాయం
- మంత్రి ఆనం ఎదుట బాధితుల గోడు



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ శెట్టి బలిజ, పూసల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అర్జీలు స్వీకరించారు. వైఎస్ఆర్ కడప జిల్లా వీరబల్లి మండలం సానిపాయి గ్రామానికి చెందిన నేతి రమేష్‌బాబు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ తమ గ్రామ పరిధిలో సర్వే నంబర్లు 897 (2.50 ఎకరాలు), 769/5 (2.00 ఎకరాలు), 897/13 (2.00 ఎకరాలు)లో కొంతకాలంగా పేద రైతులు సాగు చేసుకుంటు న్నారు. వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ నేతి ఆంజినేయులు తన సతీమణి నేతి లక్ష్మీదేవి పేరు మీద అలాగే ఎంపీటీసీ గుగ్గిల్ల చిన్నక్క, సర్పంచ్ సోదరుడు (ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ) తదితరుల పేరు మీద డీకేటీ పట్టాలు పొందారు. ప్రభుత్వ ఉద్యో గం ఉన్న వారికి డీకేటీ పట్టాలు పొందే అర్హత లేకపోయినప్పటికీ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఈ పట్టాలు పొందారు. పట్టా పొందిన వారు ఎన్నడూ భూమి వద్దకు రాలేదు. 2023 రీ-సర్వే సమయంలో రాజకీయ బలంతో సాగులో ఉన్న పేద రైతులపై దౌర్జన్యానికి దిగారు. వారిపై చర్యలు తీసుకుని అక్రమ పట్టాలు రద్దు చేసి పేద రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

### ఆస్తిని మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు

కర్నూరు జిల్లా కల్లూరు మండలం న్యూ కృష్ణానగర్‌కు చెందిన జంగం కేదారేశ్వరయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. బి.వెంకటరమణయ్య, పోచా ప్రవీణ్‌రెడ్డి, పోచా జ్యోత్స్న సహా మొత్తం 11 మంది ఒక ముఠాగా ఏర్పడి తనకి కేవలం రూ.10 లక్షలు ఇచ్చి సుమారు రూ.8 కోట్ల విలువైన ఆస్తిని మోసపూరి తంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతటితో ఆగక తన నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు, స్టాంపు పేపర్లపై బలవం తంగా సంతకాలు చేయించుకున్నారు. తమను ఎదిరిస్తే చంపేస్తా మని నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నారు. గత ప్రభుత్వం లో ఈ విషయంపై ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా రాజకీయ ఆర్థిక బలంతో కేసులు క్లోజ్ అయ్యేలా చూశారు. ఈ కేసులో తనకి అన్యాయం జరిగిందని నిజం చెప్పేందుకు ముందుకు వచ్చిన జి.శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తిపై నిందితులు రెండుసార్లు హత్యాయత్నానికి పాల్పడ్డారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అండతో తమ కుటుంబాన్ని మానసికం గా, ఆర్థికంగా దెబ్బతీశారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### ఫోర్జరీతో వైసీపీ నాయకుల మోసం

వైఎస్ఆర్ జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామానికి చెందిన చెన్నకేశవులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నెంబర్ 145/1లో తన పిత్రార్జి తంగా వచ్చిన భూమి ఉంది. భూమికి సంబంధించి అన్ని ఒరిజినల్ పత్రాలు తన వద్దే ఉన్నాయి. వైసీపీ నాయకులు అధికా ర బలంతో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఫోర్జరీ పత్రాలు సృష్టించి ఆన్‌లైన్ రికార్డులను మార్చేశారు. 20 సెంట్ల భూమిని తప్పుడు పత్రాలతో తన పేరు మీద నుంచి తొలగించి కబ్జా చేశారు. దీనిపై పలుమార్లు అధికారులు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### భూమిని ఆన్‌లైన్ చేయాలి

గుంటూరుకు చెందిన మురళీధర్ గుప్త గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన అన్న లేట్ పచ్చిపులుసు రామనాథయ్య ద్వారా అన్నమయ్య జిల్లా (పూర్వపు చిత్తూరు) పెద్ద తిప్పసముద్రం మండలం పులికల్లు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 335-1లో 0.32 సెంట్ల భూమి దానంగా లభించింది. ఈ మేరకు 10-11-2021న తంబళ్ళపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెం.1624/2021గా రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. రిజిస్ట్రేషన్ జరిగి మూడేళ్లు గడుస్తున్నా సదరు భూమిని ఇంకా రెవెన్యూ ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు చేయలేదు. దీనివల్ల పట్టాదారు పాసు పుస్తకం, 1-బి, అడంగల్ పొందలేకపోతున్నాను. తమ భూమిని ఆన్‌లైన్ చేసి తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### 21ఏ నుంచి తొలగించాలి

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం కోటవారిపల్లి గ్రామా నికి చెందిన కృష్ణమూర్తి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత మూడు తరాలుగా గ్రామంలోనే ఉంటూ తమకున్న భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. తన కుమారుడి కోరిక మేరకు ఉన్నతంగా బతకాలన్న ఆశతో ఆ భూమిలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టాం. ఇందుకోసం అప్పులు చేసి ఎంతో కష్టపడి ఇల్లు నిర్మిం చుకున్నాం. అయితే సదరు భూమి సెక్షన్ 21ఏ కింద ఉండటంతో సాంకేతిక కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. గత రెండేళ్లుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో తమ కుటుం బం ఆర్థిక ఇబ్బందులకు గురైంది. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. తమ భూమిని 21ఏ జాబితా నుంచి తొలగించాలని కోరాడు.

# తక్కువ ధరల్లో జనరిక్ పశు ఔషధాలు

## రాష్ట్రవ్యాప్తంగా 150 విక్రయ కేంద్రాలు : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని పశు పోషకులకు నాణ్య మైన జనరిక్ పశు ఔషధాలను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచి పశు సంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ, పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన లో తెలిపారు.

2024 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పశుపోశకులకు సబ్సిడీపై మందుల పంపిణీ అందచేసేలా చేసిన హామీ ని నేడు నేరవేర్చనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 150 పశు ఔషధ విక్రయ కేంద్రాలును మొదటి దశలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పశుపోషకులకు తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలు అందించడంతో పాటు జంతువుల చికిత్స ఖర్చులను గణనీయంగా తగ్గించగల మన్నారు. గ్రామస్థాయి గొర్రెల పెంపక సహకార సంఘాల ద్వారా మాత్రమే ఈ కేంద్రాలు నిర్వహించబడతాయని, మహిళా సభ్యుల కు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఆశావహ జిల్లాల్లో ఒక్కో కేంద్రానికి రూ.1.5 లక్షల ప్రత్యేక సహాయం అందిస్తామని వెల్లడించారు.

యూనిట్‌కు రూ.3.61 లక్షల వ్యయంతో మొత్తం రూ.5.41 కోట్ల ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, కొనుగోలు.. నిల్వలపై 20 శాతం ప్రోత్సాహకం, విక్రయాలపై 20 శాతం మార్జిన్ లభిస్తుందని తెలిపారు. పీఎంబీఐ సమన్వయంతో నాణ్యత నియంత్రణ, సరఫరా నిర్వహణ జరుగుతుందని, ఈ కేంద్రాలు పశు వైద్యశాల ఆవరణలో నిర్వహించబడతాయని, అన్ని లావా దేవీలు పీవోఎస్ వ్యవస్థ (పాయింట్ ఆఫ్ సేల్) ద్వారా నిర్వహి స్తామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, పశుసంవర్ధక రంగం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

## 22ఏ నుంచి ప్రైవేటు భూముల తొలగింపు సరళతరం

*- అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్*



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 22ఎ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించే ప్రక్రియను మరింత సరళతరం చేస్తామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే కొలికలపూడి శ్రీనివాసరావు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భూ ఆక్రమణ, 22ఎ జాబితా నుంచి తొలగింపు అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి అనగాని సమాధానమిస్తూ 22ఎ నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూములను తొలగించేందుకు ఇప్పటికే మెమోను జారీ చేశామని, ఇందులో ఐదు రకాల భూము లను నిషేధిత జాబితా నుంచి తొలగించే అవకాశాన్ని కల్పించా మని చెప్పారు. ఈ సందర్భంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కలు గజేసుకుని 22ఎ నిషేధిత భూముల సమస్య రాష్ట్రమంతా ఉందని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం కూడా మంచి మార్గదర్శకాలు కూడా ఇచ్చిందని, ఇవి అమలయ్యేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందిస్తూ 22ఎ నిషేధిత జాబితా నుంచి ప్రైవేట్ భూముల తొలగింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తామన్నారు. తమ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తాను, అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకుంటూ ఒక టీమ్‌గా ఏర్పడి 22ఏ భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తు న్నామని చెప్పారు. పేదలకు లబ్ధి జరిగేలా సామాన్యులు నష్టపో కుండా ఉండేలా 22ఎ నిషేధిత భూముల సమస్యను పరిష్క రించమని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మార్గనిర్దేశం చేశా రని, తాము ఆ దిశగా పని చేస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో 22ఏ భూముల తొలగింపునకు ఇచ్చిన ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక డ్రైవ్ చేపడతారని చెప్పారు. తిరువూరు మండలంలోని రామన్న పాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 22లో ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రశ్న అడగగా ఆ భూములకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయని, కోర్టు తీర్పు వచ్చేంతవరకు ఎదురు చూడాల్సి ఉందన్నారు. అలాగే విశాఖలో మాజీ సైనికోద్యోగులకు అసైన్డ్ చేసిన భూముల అమ్మకాలకు సంబంధించి బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మాజీ సైనికోద్యోగులకు కేటాయించిన భూములను పదేళ్ల తర్వాత వారు, వారి వారసులు అమ్ముకోవచ్చని తెలిపారు. అయితే అలా కేటాయించిన భూముల్లో నీటి వనరులు ఉంటే కొన్ని సుప్రీం కోర్ట్, హైకోర్టు తీర్పుల రీత్యా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చిన ఆదేశాల ప్రకారం వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని సమాధానమిచ్చారు. అందుకే వాటిని నిషేధిత జాబితా లో పెట్టినట్లు తెలిపారు.

## పర్యాటక రంగానికి మహర్దశ

- **మంత్రి కందుల దుర్గేష్**
- **భవానీ ద్వీపంలో ఘనంగా ఏపీటీడీసీ గోల్డెన్ జూబ్లీ వేడుకలు**



విజయవాడ (చైతన్యరథం): ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర పర్యాటక రంగాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టడంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ కీలక పాత్ర పోషించిందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఏపీటీడీసీకి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా బుధవారం విజయవాడ సమీపంలోని భవానీ ద్వీపంలో నిర్వహించిన స్వర్ణోత్సవ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలితో కలిసి మంత్రి దుర్గేష్ భవాని ఐల్యాండ్‌కి వచ్చారు. జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏపీటీడీసీ 50 ఏళ్ల లోగోను మంత్రి ఆవిష్కరించారు. ఏపీటీడీసీ ప్రస్థానాన్ని తెలిపేలా రూపొందించిన ఏవీని ఆసక్తిగా తిలకించారు. ఏపీటీడీసీ చైర్మన్, ఉన్నతాధికారులతో కలిసి బెలూన్లు ఎగరవేశారు. అనంతరం 50 ఏళ్ళ పర్యాటకాభివృద్ధి సంస్థ విజయగాథను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ 1976 ఫిబ్రవరి 18న పరిమిత సేవలతో ఏర్పాటైన ఏపీటీడీసీ అంచెలంచెలుగా అభివృద్ధి చెంది నేటికి 50 ఏళ్లు పూర్తి చేసుకుని సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన పర్యాటక రంగాన్ని కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిచ్చిందని తెలిపారు. కేవలం 18 నెలల కాలంలోనే 117 ప్రఖ్యాత సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకుని రూ.20,088 కోట్ల పర్యాటక పెట్టుబడులు ఆకర్షించామని తద్వారా 1,22,637 ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేశామన్నారు. ప్రస్తుతం రూ.6681 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. టెంపుల్ టూరిజం, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్, వెల్నెస్, మెడికల్, కల్చర్, ఫిల్మ్, క్రూయిస్ తదితర విభిన్న పర్యాటక ప్రక్రియలను చేపట్టడంతో పాటు హోమ్ స్టే, టెంట్ సిటీస్, క్యారవాన్, హౌస్ బోట్స్, నిత్యం ఈవెంట్స్, ఫెస్టివల్స్, జాతీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు, సదస్సులు తదితర వినూత్న కార్యక్రమాలతో పర్యాటక శాఖ ముందుకు సాగుతోం దన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా కల్పన, నూతన పర్యాటక పాలసీ 2024-29 విడుదల, ఇన్వెస్టర్లకు ఆకర్షణీయమైన రాయితీలు కల్పించడం వంటి అంశాలతో ప్రస్తుతం స్వర్ణయుగం నడుస్తోందన్నారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచడమే తమ లక్ష్యమన్నారు. భవిష్యత్తులో ఒకే ఒక ఇజం ఉంటుంది అదే టూరిజం అని మంత్రి దుర్గేష్ నినదించారు. ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు..

**ఐదు దశాబ్దాల అద్భుత ప్రస్థానం:**

1976లో కేవలం రూ.13లక్షల మూలధనంతో ప్రారంభమైన ఏపీటీడీసీని నేడు రూ.20వేల కోట్ల పెట్టుబడులకు బాటలు వేశామన్నారు. నేడు దేశంలోనే అత్యధికంగా పర్యాటకులు సంద ర్శించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను 4వ స్థానంలో నిలిపామన్నారు.. ఏ ప్రైవేట్ సంస్థా సాహసించని సమయంలో శ్రీశైలం, అరకు, గండికోట వంటి మారుమూల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి పర్యాటక మార్కెట్‌ను సృష్టించిన ఘనత ఏపీటీడీసీదేనని కొనియాడారు.

**కేంద్ర ప్రభుత్వ భారీ సహకారం:**

రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా పర్యాటక రంగానికి కేంద్రం నుంచి రూ.428 కోట్ల భారీ గ్రాంట్ లభించిందని వెల్లడించారు. తద్వారా 8 పర్యాటక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.97.52 కోట్లతో సూర్యలంక బీచ్, రూ. 94.44 కోట్లతో అఖండ గోదావరి పునరుద్ధరణ, రూ.77.91 కోట్లతో గండికోట గార్జ్ ఎక్స్‌పీరియన్స్, రూ.54.04 కోట్ల ప్రసాద్ స్కీమ్ నిధులతో సింహాచలం అభివృద్ధి, రూ. 79.83 కోట్లతో బొర్రా గుహలు, అహోబిలం, నాగార్జునసాగర్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులను ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు.

కొవిడ్-19 వంటి విపత్కర పరిస్థితుల్లో పర్యాటక ఆదాయం సున్నా అయినప్పటికీ ఏపీటీడీసీ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి ఆసుపత్రులకు, క్వారంటైన్ సెంటర్లకు ఆహారం సరఫరా చేశారని మంత్రి గుర్తు చేశారు. ఆ సమయంలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, ఏపీటీడీసీ ఎండీ, రిటైర్డ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన మహిళల నెట్‌బాల్ పోటీలు

**- విజేతలకు బహుమతుల ప్రదానం**

**- పాల్గొన్న శాప్‌చైర్మన్ రవినాయుడు**

విజయవాడ(చైతన్యరథం): కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మేరీస్ స్టెల్లా కాలేజీలో బుధవారం నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల నెట్‌బాల్ టోర్నమెంట్ 2025-26 ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాప్ చైర్మన్ అనిమి ని రవినాయుడు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా 58 యూనివర్సిటీ జట్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతి భను ప్రదర్శించాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారి ణులు ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని కనబరిచారు. ఈ సందర్భంగా అనిమిని రవినాయుడు మాట్లాడుతూ మహిళా క్రీడల అభివృద్ధికి ఇటువంటి జాతీయ స్థాయి పోటీలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి రాష్ట్రం, దేశానికి గొప్ప క్రీడాకారిణులను తయారు చేయ డం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం విజేతల కు బహుమతులు ప్రదానం చేశారు. రాబోయే టోర్నమెంట్‌లలో కూడా ఇదే ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించాలని అభి నందించారు. ఈ కార్యక్రమములో ప్రొఫెసర్ కె.రత్న షీలామని (వైస్ చైర్ పర్సన్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్), ప్రొఫెసర్ రాంజీ (వైస్ చాన్సలర్, కృష్ణా యూనివర్సిటీ), ప్రొఫెసర్ మండవ బసవేశ్వరరావు (రెక్టార్, కృష్ణా యూనివర్సిటీ), సిస్టర్ ఇనియాసమ్మ (ప్రిన్సిపల్, మేరీస్ స్టెల్లా కాలేజీ), ఫిజికల్ డైరెక్టర్స్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## సంపాదన అంటే...

**సంపాదించడం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు... విజ్ఞానాన్ని, మనుషులను, వారి ప్రేమను సంపాదించడం... ఇది కేవలం సమాజానికి తిరిగి ఇవ్వడం ద్వారానే సాధ్యపడుతుంది' అంటున్నారు ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ బోర్డు చైర్మన్ కంచర్ల కిషోర్. నాట్స్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన అంతరంగం 'చైతన్యరథం' పాఠకుల కోసం...**

# సమాజానికి తిరిగి ఇవ్వడమే

- దానికే నా తొలి ప్రాధాన్యం
- 'నాట్స్' చైర్మన్ కిషోర్ కంచర్ల



*డల్లాస్:* ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడ-పామర్రు సమీపంలోని రిమ్మనపూడి గ్రామంలో సినీ నిర్మాత-దర్శకులు పూర్ణచంద్రరావు-విజయలక్ష్మి దంపతులకు కిషోర్ జన్మించారు. 2000లో కేవలం 110 డాలర్లతో అమెరికాకు వచ్చిన కిషోర్ ఐటీ రంగాన్నే పునాదిగా చేసుకుని అమెరికాలో బిర్యానీ సామ్రాజ్యాన్ని నిర్మించి వందల కోట్ల విలువైన వ్యాపారాలను సృష్టించారు.

2011లో హోటళ్ల రంగంలో అడుగిడిన ఆయన డాలస్‌లో బావర్చిని ప్రారంభించి దాన్ని శరవేగంగా విస్తరించారు. ఒక శాఖతో ఆగకుండా దానిని ఒక బ్రాండ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుని 2019కల్లా అమెరికా అంతటా 50కి పైగా బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి లక్ష్యాన్ని చేరుకున్నారు. కేవలం రుచి, నాణ్యతతోనే తాను విజయాలు సాధించానని కిషోర్ వెల్లడించారు. అందుకే ఇప్పటికీ రెస్టారెంట్‌కు వెళ్లి కస్టమర్ల ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం తనకు అలవాటని చెప్పారు. భారతీయ రుచులను, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ఘుమఘుమలను అమెరికన్లకు పరిచయం చేశారు.

2020లో ఆర్కానా వెంచర్స్‌తో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అడుగుపెట్టారు. నేడు సుమారు $600 మిలియన్ల విలువైన ఆస్తులను నిర్వహించే స్థాయికి ఆర్కానా వెంచర్స్ ఎదిగింది. మార్బుల్ మైనింగ్, పినాకిల్ సర్ఫేసెస్‌తో పాటు అట్లాంటా, డల్లాస్, అలబామాలలో మూడు ఐటీ కంపెనీలను, ఆరోగ్య రంగ సేవలను విజయవంతంగా నిర్వహిస్తూ ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

కిషోర్ తండ్రి పూర్ణచంద్రరావు నిర్మాత-దర్శకుడు కావడంతో ఆయనకు సినీ రంగంతో మంచి అనుబంధం ఉంది. సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ, ఆయన తనయుడు మహేష్‌బాబు కుటుంబాలతో, సంగీత దర్శకుడు ఇళయరాజాతో ప్రత్యేక అనుబంధం ఉంది. లండన్ సింఫనీ ఆర్కెస్ట్రా కోసం ఇళయరాజా స్వయంగా కిషోర్‌ని ఆహ్వానించడం వారి మధ్య ఉన్న అనుబంధానికి నిదర్శనం. కీరవాణి, మణిశర్మ, ఆర్పీ పట్నాయక్, మనో, సినీ దర్శకులు కె.రాఘవేంద్రరావు, ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్ తదితరులతో ఆయనకు మంచి స్నేహం ఉంది.

సంపాదించడమే కాదు తిరిగి సమాజానికి ఇవ్వడం కూడా ముఖ్యమని తాను నమ్ముతానని... అందుకే నాట్స్ ద్వారా సేవా కార్యక్రమాలను బలోపేతం చేయడమే గాక నాట్స్ శాఖలను కూడా విస్తరిస్తామని కిషోర్ తెలిపారు. 2008 నుంచి 'నాట్స్'లో పలు పదవులు నిర్వహించిన ఆయన 2013, 2019లలో డాలస్‌లో జరిగిన నాట్స్ సంబరాలకు మద్దతు అందించారు. 2019 నాట్స్ తెలుగ సంబరాల కమిటీకి చైర్మన్‌గా కూడా వ్యవహరించి సంబరాలను అద్భుతంగా నిర్వహించారు. 2020లో కొవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్లు, ఆహార సామగ్రి వితరణ, సొంత గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు.

తన విజయం వెనుక తన సతీమణి బిందు, పిల్లలు గౌతమ్, హరిణి, జనని తోడ్పాటు మరువలేనిదని కిషోర్ వెల్లడించారు.

North America Telugu Society

NATS

ఉత్తర అమెరికా తెలుగు సంఘం

## తానా ఆధ్వర్యంలో...

# పైతాన్ వర్క్‌షాప్

తానా: యువతకు భవిష్యత్తు సాంకేతిక నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), సాప్తోరా సంయుక్తంగా ఏఐ పవర్డ్ పైతాన్ వర్క్‌షాప్ నిర్వహించింది. ఎనిమిది సెషన్లలో వర్చువల్‌గా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 10 సంవత్సరాలు పైబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ వర్క్‌షాప్, పైతాన్ ప్రోగామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పునాది అంశాలను సులభంగా, ప్రాక్టికల్ విధానంలో నేర్పేలా రూపకల్పన చేశారు.

కార్యక్రమాన్ని తానా కోశాధికారి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాజా కాసుకుర్తి ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, కమ్యూనిటీ సభ్యులకు ఆయన హృదయపూర్వక స్వాగతం పలికి ఈ వర్క్‌షాప్ ప్రాముఖ్యతను వివరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... "ఈ రోజు మనం కేవలం కోడింగ్ క్లాసను ప్రారంభించడం కాదు- భవిష్యత్తుకు తలుపులు తెరుస్తున్నాం. టెక్నాలజీ ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తోంది. ఈ విప్లవానికి కేంద్ర బిందువు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పైతాన్ ప్రోగ్రామింగ్." అన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు పైతాన్ పునాది అంశాలను నేర్చుకోవడంతో పాటు ఏఐ కాన్సెప్ట్‌పై అవగాహన పొందుతూ తమ సొంత ప్రాజెక్టులను రూపొందించే ధైర్యాన్ని సంపాదిస్తారన్నారురు. విద్యార్థులు ప్రశ్నలు అడిగి ఆసక్తిగా నేర్చుకుంటూ సృజనాత్మకంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు.

తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు తమ సందేశాలను అందించారు. యువత చిన్న వయసులోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యమన్నారు. ప్రోగ్రామింగ్, ఏఐ వంటి నైపుణ్యాలు విద్యార్థుల్లో తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, విశ్లేషణాత్మక దృష్టిని పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ రంగాల్లో ముందంజలో నిలవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమన్నారు.

### ఉత్సాహభరితమైన మొదటి సెషన్

మొదటి రోజు నుంచే విద్యార్థుల్లో చురుకైన భాగస్వామ్యం కనిపించింది. లైవ్ కోడింగ్ డెమోస్, క్విజ్‌లు, ఇంటరాక్టివ్ చర్చలు, ప్రాథమిక కాన్సెప్ట్‌పై వివరణలు కార్యక్రమాన్ని మరింత ఆసక్తికరంగా మార్చాయి. విద్యార్థులు చాట్ ద్వారా ప్రశ్నలు అడిగిపోల్స్‌లో పాల్గొని ఉత్సాహంగా స్పందించారు.

### యువత భవిష్యత్తుకు పెట్టుబడి

యువత శక్తిని అభివృద్ధి చేయడం 'తానా' ప్రధాన లక్ష్యం. విద్య, సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనిటీ సేవల ద్వారా సమాజానికి విలువను అందించడంలో తానా ఎల్లప్పుడూ ముందుంటోంది. ప్రారంభ కార్యక్రమంలో చెప్పినట్లుగా "భవిష్యత్తును ఊహించాలంటే దాన్ని కోడ్ చేయాలి. ఈ కార్యక్రమం యువతలో సాంకేతిక అవగాహనను పెంపొందిస్తూ, వారి భవిష్యత్తు విజయాలకు బాటలు వేస్తుంది' అని నిర్వాహకులు చెప్పారు.

## శాన్ ఆంటోనియోలో

# వాలీబాల్ సంబరం

## 'తాసా' ఆధ్వర్యంలో 28న మెగా టోర్నీ

తాసా: శాన్ ఆంటోనియోలోని తెలుగు క్రీడాభిమానుల కోసం శాన్ ఆంటోనియో తెలుగు సంఘం (తాసా) రెండో వార్షిక వాలీబాల్ టోర్నమెంటును ఘనంగా నిర్వహించనుంది. 'సర్వ్, స్పైక్, సెలబ్రేట్' అనే స్ఫూర్తిదాయక నినాదంతో ఈ పోటీలు జరగనున్నాయి. స్థానిక తెలుగు వారిలో ఐక్యతను, క్రీడా నైపుణ్యాన్ని చాటిచెప్పేందుకు ఈ వేదికను సిద్ధం చేశారు.

తేదీ: ఫిబ్రవరి 28, 2026 (శనివారం).

సమయం: మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం.

వేదిక: 'ఆర్డర్ ఆన్ ది కోర్ట్' (కోర్ట్స్ 1, 2), 4320 ఇండస్ట్రియల్ సెంటర్, శాన్ ఆంటోనియో, టీఎక్స్ 78217.

రిజిస్ట్రేషన్ వివరాలు:

జట్టు రిజిస్ట్రేషన్ ఫీజు: 80 డాలర్లు

చివరి తేదీ: ఫిబ్రవరి 21.

చెల్లింపు విధానం: Zelle ద్వారా paytotasa@gmail.comకు పంపవచ్చు.

నమోదు ప్రక్రియ: http://bit.ly/tasavb26reg లింక్ ద్వారా జట్టు పేరు, ఆటగాళ్ల జాబితాను సమర్పించాలి.

ఈ ఈవెంట్‌కు సంబంధించిన సందేహాలు, పూర్తి వివరాలకు అనిల్ సంఘు భట్ల (515) 991-9535. ఆది నారాయణ (919) 916-0919లను సంప్రదించాలి. భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శాన్ ఆంటోనియో తెలుగు సంఘం ప్రతినిధులు కోరారు.




# సీతారాముల కళ్యాణము చూతము రారండి

## మార్చి 28న కాళీబరి ఆలయంలో...

కెనడా: కెనడాలోని తెలుగు భక్తుల కోసం తెలంగాణ కెనడా అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించబోతోంది. 'శ్రీశ్రీశ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం' పేరుతో జరుగుతున్న ఈ కార్యక్రమానికి మిస్సిసాగాలోని కాళీబరి ఆలయం వేదిక కానుంది.

తేదీ: మార్చి 28, 2026 (శనివారం)

సమయం: ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం

వేదిక: కాళీబరి టెంపుల్, 6815 ప్రొఫెషనల్ సిటీ, మిస్సిసాగా, ON L4V 1X6.

ప్రత్యేక ఆకర్షణ: ఈ వేడుకకు వచ్చే భక్తుల కోసం భద్రాచలం నుంచి నేరుగా తెప్పించిన ప్రసాదం లడ్డూ అందజేయనున్నారు. విచ్చేసిన వారందరికీ ప్రసాదం, మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంది. ప్రవేశం ఉచితం.

స్పాన్సర్‌షిప్ వివరాలు: కల్యాణ మహోత్సవంలో భాగస్వాములు కావాలనుకునే వారికోసం వివిధ స్పాన్సర్‌షిప్ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి.

కల్యాణం (స్టేజ్) స్పాన్సర్‌షిప్: 516 డాలర్లు (కేవలం 2 స్పాట్స్ మాత్రమే).

కల్యాణం స్పాన్సర్‌షిప్: 51 డాలర్లు

సంకల్పం స్పాన్సర్‌షిప్: 21 డాలర్లు

వీటితో పాటు భోజనం, పూజా సామగ్రి కోసం విరాళాలు స్వీకరిస్తారు. Interac Id: payments@telangana.ca ద్వారా చెల్లింపులు చేయవచ్చు.

మరిన్ని వివరాలకు... స్ఫూర్తి కొప్పు, కల్చరల్ సెక్రటరీ: (647) 469-3419 - శంకర్ పోపూరి జనరల్ సెక్రటరీ: (647) 888-4777లను సంప్రదించాలి.

# పల్లె పరిశుభ్రత మన అందరి బాధ్యత



పోలాకి (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలాకి మండలం, మబగాం గ్రామంలో పొడి చెత్త సేకరణ ప్రత్యేకంగా స్వచ్ఛ రథాన్ని నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ప్రారంభించారు. ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ... ప్రజలు తమ ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను అందిస్తే, వాటి బదులుగా నిత్యావసర సరుకులను రథం సిబ్బంది అందజేస్తారని, సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా పర్యావరణ సంరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ధర్మాన అమ్మన్నాయుడు, కాయ రవి, జుత్తు తాతబాబు, వెలమల రమేష్, కర్రెన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అల్పపీడనం ఎఫెక్ట్... వాతావరణంలో పలు మార్పులు

తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి.. కేవలం తెల్లవారుజామున వేళల్లో మాత్రమే కొంచెం చలి ఉంటోంది.. ఆ తర్వాత ఎండలు పెరుగుతున్నాయి.. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వాతావరణ పరిస్థితులపై వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. వాతావరణ శాఖ అప్డేట్ ప్రకారం.. భూమధ్య రేఖా హిందూ మహాసముద్రం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతం మీద ఏర్పడిన అల్పపీడన ప్రాంతం గత బుధవారం 2026, 08:30 గంటలకు అదే ప్రాంతంలో కొనసాగింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది రాగల 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా శ్రీలంక వైపు కదులుతూ నైరుతి బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న భూమధ్య రేఖా హిందూ మహాసముద్రం మీదుగా మరింతగా బలపడే అవకాశం ఉంది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దిగువ ట్రోపో ఆవరణములో ఆంధ్రప్రదేశ్ - యానములో తూర్పు, ఆగ్నేయ దిశగా వీస్తున్నాయి. దీంతో కోస్తాంధ్రలో గురువారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. దట్టమైన పొగమంచు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. రాయలసీమలో గురువారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. పొగమంచు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. శుక్రవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. రాగల 2 రోజుల్లో రాయలసీమలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణముకంటే 2-4 డిగ్రీల సెంటిగ్రేడ్ తక్కువగా నమోదయ్యే అవకాశముంది. కోస్తాంధ్రలో రాగల 3 రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు లేదు.

# సికింద్రాబాద్ నుంచి విశాఖకు వచ్చే

## వందే భారత్ సమయ వేళల్లో మార్పు




సామాన్యుల నుంచి ఉన్నత వర్గాల వారు రైలు ప్రయాణాన్ని ఎంచుకుంటారు. ఎందుకంటే ఎలాంటి రిస్క్ లేకుండా ప్రయాణించవచ్చు. అలాగే రైల్వే ఛార్జీలు తక్కువగా ఉండటంతో చాలా మంది రైలు ప్రయాణాన్ని ఎంచుకుంటారు. అయితే ఇప్పుడప్పుడు రైళ్ల సమయ వేళలను మారుస్తుంటుంది రైల్వే శాఖ. రైలు ప్రయాణం చేసే వారు సమయ వేళలను తెలుసుకుని వెళ్లడం చాలా ముఖ్యం. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రద్దీని తగ్గించడానికి ఫిబ్రవరి 20వ తేదీ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో రాక సమయ వేళను సవరించారు రైల్వే అధికారులు. రైలు నంబర్ 20707 సికింద్రాబాద్-- విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రాక సమయాలను సవరించాలని తూర్పు కోస్ట్ రైల్వే నిర్ణయించింది. విశాఖపట్నం చేరుకునే ప్రస్తుతం, సవరించిన సమయాలు ఈ విధంగా ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రాక సమయం ప్రస్తుతం మధ్యాహ్నం 1.45 గంటలకు ఉండగా, ఇప్పుడు 1.50 గంటలకు మార్చారు. ఈ సమయ వేళలు 20వ తేదీ నుంచి అమల్లోకి రానుందని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా, దేశంలోని వివిధ నగరాల మధ్య ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయడం కోసం.. భారత రైల్వే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. 2019 ఫిబ్రవరిలో వందే భారత్ సర్వీసులను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ వందే భారత్ విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు గరిష్టంగా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలవు. ఇటీవలే వందే భారత్ స్లీపర్ రైళ్లను సైతం ప్రారంభించారు. పూర్తి ఏసీ బోగీలతో కూడిన వందే భారత్ రైళ్లలో సేవలు మిగతా రైళ్లతో పోలిస్తే ఎంతో మెరుగ్గా ఉంటాయి. అయితే సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పోలిస్తే వీటిలో టికెట్ల ధరలు కూడా ఎక్కువే.

# మనమిత్ర వాట్సప్ ద్వారా పదోతరగతి హాల్ టికెట్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ముందుగా ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత పదో తరగతి పరీక్షలు విద్యాశాఖ జరపనుంది. అయితే పదో తరగతి హాల్‌టికెట్లు మార్చి మొదటి వారంలోనే విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు కేవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదంటే లీప్ యాప్, మన మిత్ర వాట్సప్ నంబరులోనూ హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. హాల్ టికెట్లలో విద్యార్థుల పేర్లు, ఇంటి పేర్లు, పుట్టిన తేదీ వంటి వివరాలు ఏవైనా తప్పుగా ఉంటే సవరణకు అవకాశం కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. పరీక్ష అనంతరం కూడా మార్కుల మెమోలు జారీ చేసే వరకు విద్యార్థుల వివరాలను సరిచేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. కాగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి మార్చి 30వ తేదీ వరకు ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల అనంతరం ఏప్రిల్ 4వ తేదీ నుంచే జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్ణయించింది. ఏప్రిల్ 13వ తేదీ వరకు మొత్తం 10 రోజుల పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుంది. ఏపీ పదో తరగతి పబ్లిక్ పరీక్ష 2026 పూర్తి టైమ్‌టేబుల్ ఇదే.. మార్చి 16న ఫస్ట్ లాంగ్వేజ్, మార్చి 18న సెకండ్ లాంగ్వేజ్, మార్చి 21న ఇంగ్లిష్ పరీక్ష (మార్చి 20 నుంచి 21కి పరీక్ష తేదీ మారింది), మార్చి 23న మ్యాథమెటిక్స్, మార్చి 25న ఫిజికల్ సైన్స్, మార్చి 28న బయాలజికల్ సైన్స్ పరీక్ష, మార్చి 30న సోషల్ స్టడీస్ పరీక్ష




# ఇంటర్మీడియట్ విద్యార్థులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

- విద్యార్థులు అందరూ ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆకాంక్ష



గుంటూరు (చైతన్యరథం): "ఇంటర్మీడియట్ విద్యార్థులు అందరూ ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 23వ తేదీ నుండి ప్రారంభం కానున్న దృష్ట్యా బుధవారం వసతి గృహాల్లో ఉండి ఇంటర్మీడియట్‌కు పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్ఫూర్తిదాయక సందేశాన్ని ఇచ్చారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 24వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఉంటాయని అన్నారు. జిల్లాలో 87 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, మొత్తం 68,898 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని తెలిపారు. వీరందరిలోనూ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు టాపర్స్ గా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆత్మస్థైర్యంతో ఉండాలని ఇప్పటి వరకు చదివిన సబ్జెక్టులను క్షుణ్ణంగా పునఃశ్చరణ చేయాలని సూచించారు. ఎటువంటి భయాందోళనలకు గురికావలసిన అవసరం లేదని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రశాంతంగా పరీక్షలు రాసినప్పుడు మాత్రమే పూర్తి స్థాయిలో పరీక్షలు చక్కగా రాయగలమని అన్నారు. ఈ రెండు రోజులు మరింత ప్రశాంతత పొందాలని చెప్పారు. బాగా తెలిసిన జవాబులను ముందుగా రాయడం వలన మన మీద మనకు విశ్వాసం పెరుగుతుందని అన్నారు. భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ పరీక్షలు అత్యంత కీలకమని ఈ పరీక్షలను ఎవరు అశ్రద్ధ చేయవద్దని సూచించారు. బాగా చదవలేదని భయం కూడా అవసరం లేదని ప్రశాంత వాతావరణంలో రాయడం వలన వచ్చిన జవాబులు బాగా రాయగలమని అన్నారు. ఈ పరీక్షలు ఉన్నత స్థాయి విద్యా ఉద్యోగ అవకాశాలకు పునాది వంటిదని గ్రహించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయి పరీక్షలు అనేకం ఉన్నాయని వాటిలోనూ పోటీ పడాలని సూచించారు. భవిష్యత్తుకు పునాది వేసే ఈ పరీక్షలను ఎట్టి పరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయవద్దని అత్యుత్తమ మార్కులు సాధించుటకు కృషి చేయాలని చెప్పారు. వసతి గృహాల్లో ఉండి చదివిన అనేకమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత పదవుల్లో ఉన్నారని, వసతి గృహ విద్యార్థులు ఎవరికి తీసిపోరని నమ్మకం ఉందని అన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలని, కృషి, పట్టుదల ఉండాలని, అవి జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకు వెళ్తుందని హితబోధ చేశారు. మన జీవితం మన చేతుల్లో ఉందని మనలో సాధించాలనే పట్టుదల ఉంటే సాధించగలమని చెప్పారు. జీవితంలో ఏమి కావాలి అనుకుంటున్నామో దానిని విజువలైజేషన్ చేసుకోవాలని తద్వారా ప్రతి రోజు ప్రేరణ పొందాలని, అందుకు తగిన విధంగా కృషి చేయాలని అప్పుడు తప్పకుండా సాధించగలమని అన్నారు. ప్రతి ఒక్కరూ టాపర్ గా నిలవడానికి ఆలోచన చేయాలని ప్రేరణ కల్పించారు. వసతి గృహంలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని అదే నా ఆశయమని అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో గుంటూరు జిల్లా టాప్ ర్యాంకులో నిలవాలని, వసతిగృహంలో చదివిన గుంటూరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంకులలో నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు అందుబాటులో ఉండాలి

- వైద్యులు ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ కేవీఎస్ విజయలక్ష్మీ సూచన



శ్రీకాకుళం (చైతన్యరథం): వైద్యులు ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ కేవీఎస్ విజయలక్ష్మి కోరారు. నరసన్నపేట ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేశారు. విధుల్లో చేరిన రెండోరోజు నరసన్నపేట ఆసుపత్రిలో వైద్యులు హాజరు, వైద్యులు, రిజిస్టర్లు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే సమయానికి కొందరు వైద్యులు, సిబ్బంది బయటకు వెళ్లగా డీసీహెచ్ఎస్ తనిఖీ చేస్తున్నారని సమాచారం మేరకు ఉరుకులు.. పరుగులతో చేరారు. అనంతరం వైద్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. నిబంధనలు మేరకు ఆసుపత్రిలోనే వైద్యులు, సిబ్బంది ఉండాలని, హాజరు వేసి సొంత క్లినిక్‌లకు వెళ్లరాదని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌బాబు, వైద్యులు రమేష్, రెడ్డి భార్గవ్, మెండ సుధారాణి, చల్లా కృషి పాల్గొన్నారు.

# పునర్నిర్మాణం నుంచి పురోభివృద్ధి దిశగా నడిపే బడ్జెట్ ఇది



- ఆరు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపం
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం
- గోదావరి డెల్టా ఆధునికీకరణకు నిధులు కేటాయించాలి
- లొల్ల లాకులను పునర్నిర్మించాలి
- అసెంబ్లీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

అమరావతి (చైతన్యరథం): 2026-27 రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చడమే లక్ష్యంగా ఆరుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. బుధవారం ఆయన శాసనసభలో ప్రసంగిస్తూ ఈ బడ్జెట్‌ను అందరూ బాహుబలి బడ్జెట్ అని కొనియాడుతున్నారని...ఆ మాట సత్యమేనని పునరుద్ఘాటించారు. పునర్నిర్మాణం నుంచి పురోభివృద్ధి దిశగా నడిపించే బడ్జెట్‌గా అభివర్ణించారు. 2014 రాష్ట్ర విభజన నష్టాలతో పాటు వైసీపీ అరాచక, ఆటవిక పాలన ద్వారా సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచే విధంగా ఈనాడు రూ.3,32,205 కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వైసీపీ కుదేలుచేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం విజనరీ లీడర్, దార్శనికుడు అయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమైందందన్నారు. నిరంతర శ్రమ, అపారమైన అనుభవంతో సీఎం రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంటే మేధావులు సైతం ఆశ్చర్యపోతున్నారన్నారు. 20 నెలల కూటమి పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. విద్యాభివృద్ధికి రూ.32,300 కోట్లు, సంక్షేమానికి రూ.91,500 కోట్లు కేటాయించారన్నారు. భారీ కేటాయింపులతో గ్రామీణాభివృద్ధి, సాగునీటి రంగాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 2019 నుంచి 2024 వరకు చెత్తపాలన చూశామన్నారు.

రాజధాని అభివృద్ధికి రూ.6వేల కోట్ల కేటాయింపులతో సీబీఎన్ అనే బ్రాండ్ ఇమేజ్‌తో అమరావతికి అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి ఆశలు చిగురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును రివర్స్ టెండరింగ్ పేరుతో నాశనం చేసిన నీచచరిత్ర వైసీపీదని విమర్శించారు. పోలవరానికి భారీ కేటాయింపులతో రాష్ట్ర వ్యవసాయరంగ ముఖచిత్రమే మారిపోతుందన్నారు. పర్యాటకరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రశంసనీయమన్నారు. రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు గూగుల్ వంటి ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలను తీసుకురావడం బాబుకే సాధ్యమైందన్నారు. ఎఫ్‌డీఐలో 25శాతం రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు.

గోదావరి పుష్కరాలకు ఇక 15 నెలలే ఉందని, ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుని, నిధులు కేటాయించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.52,300 కోట్లు కేటాయించడం అంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమేనని ప్రశంసించారు.

ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంటలు దెబ్బతింటున్నా యని, బీమా చేయించుకోవడంపై రైతులకు అవగాహన లేకపోవడంతో నష్టపోతున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వమే పూనుకుని పంట నమోదుతో పాటు పంటల బీమా సైతం రైతులు చేసుకునేలాగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం దీని గురించి ఆలోచించాలన్నారు. గోదావరి డెల్టాను ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందని, బడ్జెట్ కేటాయింపులు జరపాలన్నారు. లొల్ల లాకులు శిథిలమవుతున్నాయని, బొబ్బర్లంక అమలాపురం స్టేట్ హైవే లొల్ల లాకుల మీదనుంచే వెళ్తోందని, లాకులు శిథిలమైతే సెంట్రల్ డెల్టా, 2 లక్షల ఎకరాలకు నీటి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బ్రిడ్జి దెబ్బతింటే కనెక్టివిటీ కూడా దెబ్బతింటుందని, కావున లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా నిలపాలన్న ప్రభుత్వం ఆలోచన బాగుందని... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. పారిశ్రామిక అభివృద్ధిని మూడు రీజన్లుగా చేపట్టి ముందుకు వెళ్లడం బాగుందన్నారు. 20 నెలల్లోనే ఇంత ప్రగతి సాధిస్తే రానున్న కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

# ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఏలూరు (చైతన్యరథం): బుధవారం ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పంపిణీ చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఢిల్లీలో ఉన్న కారణంగా, ఓఎస్డీ ఫణీంద్ర చేతుల మీదుగా చెక్కుల పంపిణీ నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోరుతూ ఎంపీ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 87 మంది లబ్ధిదారులకి 55 లక్షల CMRF చెక్కులు పంపిణీ చేశారు. తమ ఆరోగ్య సమస్య, ఆర్థిక పరిస్థితులు వివరించగానే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందేట్లు చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు పలువురు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన లబ్ధిదారులు, వారి సహాయకులు, పార్టీ నేతలు పలువురు భారీగా తరలి రావడంతో శాంతినగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో చింతలపూడి, పోలవరం, ఏలూరు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలు, ఎంపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల కంటే.. జగన్ ఎజెండానే వైసీపీ సభ్యులకు ముఖ్యమైపోయింది : ప్రత్తిపాటి

- వైసీపీ ఎమ్మెల్సీల ధోరణిపై సొంతపార్టీ శ్రేణులే తలలు పట్టుకుంటున్నారు
- జగన్ దోపిడీలపై ప్రజల్లో చర్చ జరగకూడదన్నదే వైసీపీ సభ్యుల లక్ష్యం
- టీటీడీకి నెయ్యి సరఫరా చేయడం లేదని హెరిటేజ్ స్పష్టంగా చెప్పినా...

వైసీపీ సభ్యులు కుక్కతోక పట్టుకొని గోదారి ఈదే ప్రయత్నం



చిలకలూరిపేట (చైతన్యరథం): "మంత్రి నారా లోకేశ్ కొలంబో పర్యటనపై పనిగట్టుకొని మరీ దుష్ప్రచారం చేయడం సాక్షి మీడియా బరి తెగింపునకు పరాకాష్ట. సొంత ఖర్చులతో క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్లడాన్ని తప్పుపడుతూ.. అవినీతి మీడియా తన అవస్థావాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేసింది. జగన్ సంతోషం కోసం... జనం మనసుల్లో విషబీజాలు నాటే దినచర్యలో వైసీపీ నేతలు.. సాక్షి మీడియా బరితెగించి ప్రవర్తిస్తున్నారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బలా... సాక్షి దుష్ప్రచారాన్ని లోకేశ్ తనదైన శైలిలో తిప్పికొట్టారు. అవినీతి మీడియా విషపురాతల సృష్టికర్తలకు.. లోకేశ్ సమాధానం కుక్కకాటుకు చెప్పుదెబ్బలా గట్టిగా తగిలిందనే చెప్పాలి. గతంలో లోకేశ్‌పై హద్దులు మీరి చేసిన దుష్ప్రచారానికి, కోర్టుల్లో క్షమాపణలు చెప్పుకునే దుస్థితి కల్పించినా.. సాక్షి రాతల్లో మార్పురాలేదు.

**రచ్చ చేయడానికే సభకు వస్తున్నారు..**

వైసీపీ ఎమ్మెల్సీలు మండలికి వస్తున్నది ప్రజాసమస్యలపై చర్చకు.. రాష్ట్రానికి మేలు చేసే అంశాలపై ప్రభుత్వానికి సలహాలు..సూచనలు ఇవ్వడానికి కాదని వారి వైఖరిని బట్టే అర్థమవుతోంది. కేవలం ఒక ఎజెండా ప్రకారం.. సభను అడ్డుకోవాలి.. రచ్చ చేయాలి అన్నదే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. టీటీడీకి నెయ్యి సరఫరా చేయడం లేదని హెరిటేజ్ సంస్థ స్పష్టంగా ఆధారాలు బహిర్గతం చేసినా కూడా.. వైసీపీనేతలు ఆ సంస్థను బదనాం చేయడం కుక్కతోక పట్టుకొని గోదారి ఈదడమే అవుతుంది. జగన్ సాగించిన కుంభకోణాలు.. దోపిడీలపై కూటమిప్రభుత్వం చేపట్టిన విచారణ.. రోజురోజుకీ బయటకొస్తున్న నాటి వైసీపీ ప్రభుత్వ అవినీతి వ్యవహారాలపై ప్రజల్లో చర్చ జరగకూడదు.. వారి మనసుల్లో ఎక్కడా జగన్ దుర్మార్గాలు ఎస్టాబ్లిష్ అవకూడదన్న ఏకైక లక్ష్యంతోనే వైసీపీ సభ్యులు అడుగడుగునా సభా నిర్వహణకు అడ్డు తగులుతున్నారు. కల్తీ నెయ్యి స్కామ్‌లో జగన్ సహా నాటి టీటీడీ పెద్దల పాత్ర ప్రజలకు తెలియకూడదన్న దురుద్దేశంతోనే, వైసీపీ సభ్యులు హెరిటేజ్ డెయిరీపై బురదజల్లుతున్నారు

**వైసీపీ సభ్యుల తీరుపై సొంతపార్టీ శ్రేణులే తలలు పట్టుకుంటున్నారు**

పెద్దలసభను వైసీపీ సభ్యులు కావాలనే పెదదారి పట్టిస్తున్నారు. ఎవరికి వారే యమునా తీరే అంటున్న వైసీపీసభ్యుల ప్రవర్తనపై సొంత కార్యకర్తలే తలలు పట్టుకుంటున్నారు. ఆధిపత్య భావజాలంతో తమలే తాము కలహించుకుంటూ.. పెద్దల సభ గౌరవప్రతిష్ఠల్ని బజారుకీడుస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే అంశాల కంటే.. తమ నాయకుడి ఆదేశాలే తమకు మిన్న అన్నట్టు ప్రవర్తిస్తున్నారు. మండలి మర్యాదను మంటగలపాలన్న ఆరాటం తప్ప... ప్రభుత్వ విధానాలపై చర్చించాలన్న ఆలోచన వైసీపీసభ్యులకు లేకపోవడం విచారకరం." అని మాజీమంత్రి ప్రత్తిపాటి బుధవారం ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భట్టిప్రోలు మండలం భట్టిప్రోలు గ్రామానికి చెందిన తమన్న ప్రకృతాంబ అమృతలూరు మండలం గోవాడ గ్రామానికి చెందిన అమృతలూరి జ్యోతి అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయాలని కోరుతూ వారి బిల్లులను వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి పంపించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సీఎంఆర్‌ఎఫ్ రూపంలో రూ.4.49 లక్షలు విడుదల చేశారు. మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధిత కుటుంబాలకు అందజేశారు.



# గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (CHC) అభివృద్ధి చేయాలని అలానే ఒక ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆసుపత్రి అభివృద్ధి కోసం తాను ఇప్పటికే కోల్ ఇండియా, హెచ్ సివిల్ సంస్థల నుండి రూ.3 కోట్ల 90 లక్షల సిఎస్ఆర్ నిధులను సేకరించినట్లు ఆయన సభకు వివరించారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి సంవత్సరం సగటున 125 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, బాధితులకు తక్షణ ప్రాథమిక చికిత్స అందించడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని ఆయన కోరారు. గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నందున, విమాన ప్రయాణికులకు ఏదైనా ప్రమాదం జరిగినా, అనారోగ్య సమస్యలు తలెత్తినా తక్షణమే చికిత్స అందించే సౌకర్యం ఉండాలని, ప్రస్తుతం వారు విజయవాడ వరకు వెళ్లాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను సొంతంగా సిఎస్ఆర్ నిధులు సేకరించిన నేపథ్యంలో, ఆసుపత్రిలోని మిగిలిన అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి చేశారు.



**విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించి పేదరికం నుండి వారికి విముక్తిని కల్పించాలి అన్నదే తెలుగుదేశం సిద్ధాంతం**

# చంద్రబాబు దూరదృష్టికి అద్దంపట్టేలా రాష్ట్ర బడ్జెట్

◆ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధిపై చంద్రబాబుకి ఉన్న దూరదృష్టికి అద్దంపట్టేలా ఉందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విద్య,వైద్యం, ఆహారం మెండుగా ఉండాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అనేక సంస్కరణలను తీసుకురావడం జరుగుతుందన్నారు. బిల్‌గేట్స్ అమరావతికి వచ్చిన సమయంలో కూడా ముఖ్యమంత్రి బిల్ గేట్స్‌తో వ్యవసాయ క్షేత్రంలో కార్పొరేట్ వ్యవసాయంపై చర్చించడం జరిగిందన్నారు. వ్యవసాయం అభివృద్ధికి సాగునీటి అవసరం చాలా ఉందని ఈ సమస్యను అధిగమించేందుకు నదుల అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విద్య పై ఆధారపడి ఉంది కాబట్టి ప్రణాళికా బద్ధంగా ప్రాథమిక విద్యను అమలు చేయాలని కోరారు. ప్రతి మండలంలో ఐటిఐ కళాశాలలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఏ పనైనా సమర్థవంతా చేయగలుగుతారు దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పిహెచ్సిలు సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీరోఅవర్‌లో ఆయన ప్రస్తావించారు.

# రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిసిన క్రీడాకారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందనలు

●పవర్ లిఫ్టింగ్, అస్మితా రోల్ బాల్‌లో గుంటూరు క్రీడాకారుల ప్రతిభ



గుంటూరు (చైతన్యరథం): క్రీడా రంగంలో గుంటూరు యువత తమ ప్రతిభను చాటుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట విజయాలు సాధిస్తున్నారని, వీరి విజయాలు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఇటీవల కర్నూల్‌లో 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన అమరావతి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు క్రీడాకారులు మెడల్స్ సాధించి ప్రతిభ కనబరిచారు. 76 కేజీల విభాగంలో టి.నాగజ్యోతి బంగారు పతకం సాధించడమే కాకుండా "ఉక్కు మహిళ" అవార్డును కూడా దక్కించుకున్నారు. అదేవిధంగా టీం ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. పీ.రీహాన్ ఖాన్ 53 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా, కే.సత్యరామరాజు 53 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం గెలుచుకున్నారు. వినోద్ కుమార్ 74 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం సాధించారు. అదేవిధంగా, రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 14, 15 ఫిబ్రవరి 2026 తేదీల్లో ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ సింగరాయకొండ, ప్రకాశం జిల్లాలో నిర్వహించిన "అస్మితా రోల్ బాల్ లీగ్" పోటీల్లో గుంటూరు నుంచి కైవల్య శ్రీ, మనస్విని, అమూల్య, హృతిక యశోద, లేహశృతి ఐదు మ్యాచ్‌లలో నాలుగు మ్యాచ్‌లు గెలిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరిలో హరిద్వార్, ఉత్తర ఖాండ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలుటి. నాగజ్యోతి, జీ.స్వాతి సాధించారు. ఈ క్రీడాకారులందరని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. వీరికి శిక్షణనిచ్చిన కోచ్‌లు షేక్ ఇమ్రాన్, షేక్ ఇష్రత్‌లను అందరూ అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... "మన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మెడల్స్ సాధించి గుంటూరు పేరు మరింత ప్రతిష్టాత్మకంగా నిలబెట్టాలని" ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఖమురుద్దీన్, షేక్ అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, డాక్టర్ సుస్మిత, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు



నందిగామ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరు కూడలిలో సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి తిరుణాళ్లు జరిగాయి. ఈ తిరుణాళ్లను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి రెండో రోజు జూనియర్ విభాగంలో క్వింటన్నర బరువును 10 నిమిషాల్లో లాగేలా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలను రైతులు ఆసక్తిగా తిలకించారు.

# నగరాభివృద్ధిని అడ్డుకున్న వైసీపీ కౌన్సిల్... త్వరలో పీడ విరగడ : ఎంపీ కేశినేని శివనాథ్

●రాబోయే కొత్త కౌన్సిల్‌తో రోడ్లు, డ్రైనేజీలు, స్టామ్ వాటర్ సమస్యలకు పరిష్కారం

●గురునానక్ కాలనీలో నూతన ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్ ప్రారంభం

●జెండా ఊపి మొబైల్ మిషన్‌ను ప్రారంభించిన ఎంపీకేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్




విజయవాడ (చైతన్యరథం): గత ఐదు సంవత్సరాలుగా విజయవాడ నగర అభివృద్ధిని అడ్డుకున్నవి, ఎం.సి వైసీపీ కౌన్సిల్ సమయం త్వరలో ముగియనుండటంతో నగరానికి పట్టిన చెద, పీడ విరగడ కానుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగర పాలక సంస్థకు కేంద్ర 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ ద్వారా రూ.1.48 కోట్ల వ్యయంతో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక ఇన్‌ఫ్రారెడ్ రోడ్ రిపేరింగ్ మొబైల్ మిషన్‌ను బుధవారం గురునానక్ కాలనీలోని మెయిన్ రోడ్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వి.ఎం.సి అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆ మొబైల్ మిషన్ పని తీరును గమనించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఎన్‌క్యాప్ (ENCAP) ద్వారా మంజూరైన ఈ మిషన్‌ను నగర రోడ్ల అభివృద్ధి, కాలుష్య నియంత్రణలో విస్తృతంగా వినియోగించనున్నట్లు తెలిపారు. ఇక నగరాభివృద్ధికి సంబంధించి ఏ ప్రతిపాదన వచ్చినా వైసీపీ కౌన్సిల్ తిరస్కరిస్తోందన్నారు. గత ఐదేళ్లుగా వి.ఎం.సి కౌన్సిల్‌లో టీడీపీ నాయకులు, కార్పొరేటర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రాజెక్టులు రాజకీయ కారణాలతో నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్ల నిధులు కేటాయిస్తే... ఆ ప్రతిపాదనను కూడా వైసీపీ కౌన్సిల్ రిజెక్ట్ చేసిందన్నారు. నగర అభివృద్ధికి అడ్డుగా వున్న ఈ వైసీపీ కౌన్సిల్ సమయం దగ్గర పడటంతో, త్వరలో రద్దు కానుందన్నారు. రాబోయే కొత్త కౌన్సిల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రామ్ వాటర్ వ్యవస్థలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. విజయవాడను అమరావతి ప్రాంతంలో మోడల్ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

**ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ...** దేశవ్యాప్తంగా గ్రీన్ డెవలప్‌మెంట్ మిషన్లను ప్రోత్సహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా ఉపయోగించుకుని రాష్ట్ర ప్రజలకు అవసరమైన కార్యక్రమాలు అమలు చేయడంలో అనుభవం కలిగిన నాయకుడు సీఎం నారా చంద్రబాబునాయుడు అంటూ ప్రశంసించారు. ఎన్‌క్యాప్ ద్వారా రూ.1.48 కోట్ల విలువైన అత్యాధునిక పాత్‌హోల్ రిపేర్ మిషన్ వీఎంసీకి ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ మిషన్ ద్వారా నగరంలోని ఎక్కడైనా గుంతలు ఏర్పడితే, కేవలం ఒకరు లేదా ఇద్దరు సిబ్బందితోనే అతి తక్కువ సమయంలో గోతులను పూడ్చవచ్చని, ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ టెక్నాలజీ ద్వారా ఎలాంటి పొల్యూషన్ లేకుండా రోడ్ల మరమ్మత్తులు చేయవచ్చని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 'మై టీడీపీ' యాప్ డౌన్లోడ్ చేసుకోండి : ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

● "స్టేట్ టు బూత్, ప్రతి సమాచారం, లీడర్ టు క్యాడర్" పోస్టర్ విడుదల



విజయవాడ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ మై టీడీపీ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో "స్టేట్ టు బూత్, ప్రతి సమాచారం, లీడర్ టు క్యాడర్" పోస్టర్‌ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... మంత్రి నారా లోకేష్ ఆలోచనలతో ప్రతి టీడీపీ కార్యకర్తకు ఉపయోగపడేలా ఈ యాప్ రూపొందించినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వ పథకాలు, పనులకు సంబంధించిన వివరాలు మొత్తం ఇందులోనే తెలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నుంచి బూత్ స్థాయి సమాచారం వరకూ ఇందులో అందుబాటులో ఉంటుందన్నారు. పార్టీకి, ప్రభుత్వానికి సంభందించిన తాజా వార్తలు, సమగ్ర సమాచారంతో "మై టీడీపీ" యాప్ మీ ముందుకు వచ్చిందన్నారు. పార్టీకి సంబంధించి ప్రతి అప్డేట్‌ను ఇందులో మీరు పొందవచ్చు. అలాగే మీకు సంబంధించిన గ్రీవెన్స్‌ను ఈ యాప్ ద్వారా తెలియజేయవచ్చు. పార్టీ కొరకు మీరు చేసే ప్రతి పని, సోషల్ మీడియా ద్వారా గ్రౌండ్ లెవెల్‌లో మీ యాక్టివిటీస్ అన్ని ఈ యాప్ ద్వారా అధిష్టానానికి తెలుస్తుంది. కావున ప్రతి ఒక్క కార్యకర్త, తెలుగుదేశం పార్టీ మద్దతు దారులు అందరూ కింద ఇచ్చిన లింక్ ద్వారా మై టీడీపీ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామ, మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయాల్లో ఈ పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. కుటుంబ సాధికార సారథులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు ఈ యాప్‌ను తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకొనగలరు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదవారికి ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపకరిస్తుంది : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గం పోరంకి తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మందికి షుమారు 17 లక్షల 54వేల 150 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో పేద,బడుగు వర్గాల ప్రజలు, హస్పిటల్ వెళ్లి నగదు చెల్లించిన పేదవారికి అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం ద్వారా ఆయా వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని, గడచిన 20 నెల కాలంలో 1400 మందికి 12 కోట్ల 96లక్షలు 66 వేల రూపాయల మేర పేదవారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం సంతోషంగా భావిసున్నాననీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోవూరు సీహెచ్‌సీని 100 పడకలతో అప్‌గ్రేడ్ చేయండి

## శాసనసభలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కోవూరు (చైతన్యరథం): కోవూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాల దృష్ట్యా ప్రస్తుతమున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. బుధవారం శాసన సభలో ఆమె శాసనసభలో మాట్లాడుతూ... కోవూరుతో పాటు విడవలూరు, కొడవలూరు మండలాలకు చెందిన దాదాపు రెండు లక్షల మంది ప్రజలకు ఈ ఆసుపత్రే ప్రధాన వైద్య కేంద్రమని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 50 పడకల సామర్థ్యం ఏమాత్రం సరిపోవట్లేదని, దీనివల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోవూరు పట్టణం భౌగోళికంగా ముంబై జాతీయ రహదారి, కృష్ణపట్నం పోర్ట్, బళ్లారి జాతీయ రహదారి మధ్య ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. క్షతగాత్రులను అత్యవసరంగా నెల్లూరు తరలించే క్రమంలో ట్రాఫిక్ అంతరాయం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కోవూరులోనే 100 పడకల ఆసుపత్రి ఉంటే అత్యవసర వైద్య చికిత్సలందించి ప్రాణాలను కాపాడవచ్చని సభ దృష్టికి తెచ్చారు. కోవూరు ప్రాంత కిడ్నీ వ్యాధిగ్రస్తుల కష్టాలను ప్రస్తావిస్తూ నెల్లూరు జీజీహెచ్‌లో ఒకే డయాలసిస్ యూనిట్ ఉండడంతో రద్దీ కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు హాస్పిటల్స్‌కు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. గ్రామీణ ప్రాంతవాసుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోవూరు ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కోవూరు సీహెచ్‌సీని 100 పడకల హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ వంటి స్పెషలిస్ట్ వైద్యుల సేవలు, అధునాతన ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తద్వారా జీజీహెచ్‌పై ఒత్తిడి తగ్గుతుందని వివరించారు.

### బిల్ గేట్స్ సమోసా ఖర్చులడుగుతున్న

# దిగజారుడు వైసీపీ నేతలు

## చిత్తూరు టీడీపీ నాయకుల ఎద్దేవా




చిత్తూరు (చైతన్యరథం): ప్రపంచ సాఫ్ట్వేర్ దిగ్గజం బిల్ గేట్స్ అమరావతికి వచ్చి చంద్రబాబునాయుడు ప్రభుత్వం పాలనలో సాంకేతికతను చూపించిన తీరును చూసి సంరమాశ్చర్యాలు గురైయితే, వైసీపీ నాయకులు సమోస ఖర్చులు ఎంత, టీ ఖర్చులు ఎంతయింది? పకోడీ ఒక ఖర్చులు ఎంత అయిందని మాట్లాడటం వాళ్ళ సాయికి తెలియజేస్తున్నదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కనీస పరిజ్ఞానం లేకుండా ప్రపంచ సాఫ్ట్వేర్ దిగ్గజాన్ని కించపరిచేరకంగా మాట్లాడటం వారి అహంకారానికి అద్దంపడుతోందన్నారు. గతంలో కూడా సూపర్ స్టార్ రజినీకాంత్‌ని నోటికి వచ్చినట్టు మాట్లాడి తెలుగు వాళ్ళ యొక్క పరువును మంట కలిపారు. మన రాష్ట్రానికి వచ్చిన ఒక పారిశ్రామికవేత్తని ఈ విధంగా అవహేళన చేయడం వాళ్ళ కు సంస్కారానికి నిదర్శనమన్నారు. భారతదేశంలో 29 రాష్ట్రాలు ఉంటే గేట్స్ అమరావతికి రావడం మన అదృష్టంగా భావించాలి. అటువంటి వ్యక్తి పైన అవాకులు చవాకులు మాట్లాడటం, అరటికాయ చూడడానికి వచ్చాడా? అనటం ఈ విధంగా వైసీపీ మూకలు దుష్ప్రచారం చేయటం, బిల్ గేట్స్ పైన నేరచరిత్ర ఉందని మాట్లాడటం వాళ్ళ పిశాచికత్వానికి నిదర్శనం. భారతదేశంలోనే పెద్ద నేరచరిత్ర కలిగిన వ్యక్తి ఎవరైనా అడిగితే జగన్మోహన్ రెడ్డి అని ఎవరైనా చెప్తారు అనే విషయాన్ని వైసీపీ నాయకులు మరిచిపోకూడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మంత్రులు నాయకులు గతంలో జగన్మోహన్ రెడ్డి ముందర నిలబడడానికి కూడా భయపడేవారని, కానీ చంద్రబాబు నాయుడు తన క్యాబినెట్ సహచరులని, ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, మంత్రులని బిల్ గేట్స్ కి పరిచయం చేసి, ఆయనతో కూర్చొని అల్పాహారం చేసే స్థాయికి తీసుకొచ్చారని ఆ విషయాన్ని వైసిపి నాయకులు గుర్తుపెట్టుకోవాలని అన్నారు. బిల్ గేట్స్ సమోసా ఖర్చుల్ని ప్రెస్ మీట్ ద్వారా ప్రశ్నిస్తున్న వైసిపి నాయకులు, కనీసం ఏనాడైనా ఒక బిల్ కలెక్టర్ అయిన రాష్ట్రానికి రప్పించారా అని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా టీడీపీ కార్యదర్శి ధరణి ప్రకాష్, తెలుగు యువత నాయకులు యువరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చేజర్ల కృతజ్ఞతలు

కోవూరు (చైతన్యరథం): తన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీడీపీ నెల్లూరు పార్లమెంట్. ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి వెల్లడించారు. మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,మిత్రులు ,శ్రేయోభిలాషులు స్వయంగా కలసి,సోషల్ మీడియా ద్వారా, ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియచేశారన్నారు. వారి ఆదరాభిమానాలు ఎల్లప్పుడూ తన పై ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు.



## సందడిగా జరిగిన బీచ్ ఫెస్టివల్ దృశ్యమాలిక















# ప్రతి విద్యార్థికీ రాజకీయాలపై అవగాహన ఉండాలి

## ఎజీఎస్ విద్యార్థులు అసెంబ్లీ సందర్శన సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, (చైతన్యరథం): విద్యార్థి దశ నుంచే రాజకీయాలు, కరెంట్ అఫైర్స్ మీద అవగాహన ఉండాలని విద్యార్థులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని ఏజీఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్ని వీక్షించారు. స్పీకర్ అనుమతితో వారు శాసనసభ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా ఎమ్మెల్యేలను ప్రత్యేకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాలు ఎలా ఉన్నాయి.. అక్కడ ఏమేమి తెలుసుకున్నారని విద్యార్థులనడిగి ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా విలువలతో కూడిన రాజకీయాలు ఎలా ఉంటాయన్నది తెలుసుకోవాలన్నారు. రాజకీయాల్లో మంచి, చెడు రెండూ ఉంటాయని.. వాటిని గమనించాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. యువత రాజకీయాల్లోకి వస్తే దేశ భవిష్యత్తు మారుతుందన్నారు.

# మృత్యుపాశాలుగా మారిన కరెంటు తీగలు

## మంత్రి గొట్టిపాటి దృష్టికి మడకశిర ఎమ్మెల్యే రాజు తక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు



మడకశిర(చైతన్యరథం): మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నివశిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలపై నుండి అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు మరియు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎమ్మెస్ రాజు కోరారు. కాలనీల్లో అత్యధికంగా పేదవారు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు ఉన్నారని వివరించారు. డిస్కాములు వసూలు చేసే షిఫ్టింగ్ ఛార్జీలను పేదవారు భరించలేరని, ప్రభుత్వమే ప్రత్యేకంగా జోక్యం చేసుకుని ఈ పనులను ప్రభుత్వ ఖర్చుతో చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో హైటెన్షన్ విద్యుత్ వైర్ల వల్ల ప్రమాదాలు జరిగాయని మంత్రికి తెలిపారు. మడకశిర నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలపై నుండి వెళ్లే పాత 11కేవీ, 33కేవీ లైన్లపై ప్రత్యేక సర్వే చేయాలని, అవసరమైన ప్రదేశాల్లో ప్రభుత్వ నిధులతో పాత విద్యుత్ స్థంభాలు, విద్యుత్ తీగలను తక్షణమే మార్చేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు సమస్యకు సంబంధించిన వినతిపత్రాన్ని అందించారు. వినతిపత్రాన్ని పరిశీలించిన మంత్రి తక్షణ చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో దశాబ్దాల తరబడి మడకశిర నియోజకవర్గంలో పేరుకుపోయిన దీర్ఘకాల సమస్యకు పరిష్కార మార్గం ఏర్పడనుంది. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ప్రత్యేక దృష్టి, పేదవారి సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యల ఫలితంగా మడకశిర ప్రజల కళ్లల్లో ఆనందం నిండనుంది.

# సీఎం చంద్రబాబు దూరదృష్టితోనే స్వర్ణాంధ్ర సాకారం

## బడ్జెట్‌పై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రూపొందించిన రాష్ట్ర బడ్జెట్ స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో కీలక మైలురాయిగా నిలిచిందని నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. సంపద సృష్టి ద్వారానే పేదరికం నిర్మూలన సాధ్యమని ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు చెబుతున్నారని, అదే తత్వంతో ఈ బడ్జెట్ రూపుదిద్దుకుందని ఆమె తెలిపారు. బడ్జెట్ అనేది కేవలం ఆదాయం, వ్యయాల పట్టిక కాదని, అది ప్రభుత్వ ప్రాధాన్యతలకు ప్రతిబింబమని అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా మూలధన వ్యయం కోసం రూ.53,915 కోట్లు కేటాయించడం అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.53,752.12 కోట్లు కేటాయించి, గత ఏడాదికంటే రూ.5,411.12 కోట్లు అధికంగా ఇవ్వడం ద్వారా రైతులకు అండగా నిలిచారని తెలిపారు. విద్యా రంగానికి రూ.36,107 కోట్లు కేటాయించడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేశారని అన్నారు. గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి నాయకత్వంలో మెగా డీఎస్సీ ద్వారా వేలాది పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయడం ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదానికి నిదర్శనమని తెలిపారు. 'తల్లికి వందనం' వంటి పథకాల ద్వారా లక్షలాది విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమం కోసం రూ.91,000 కోట్లు కేటాయించడం సామాజిక న్యాయానికి ప్రభుత్వ కట్టుబాటును చూపిస్తోందన్నారు. రైతు నిలబడితే ఆర్థిక వ్యవస్థ నిలబడుతుందని, విద్య బలపడితే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడితే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమతుల్యం చేసిన ఈ బడ్జెట్ ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.



# వసతి గృహాలకు పక్కా భవనాలు

## శరవేగంగా సాగుతున్న నిర్మాణాలు

ప్రొద్దుటూరు (చైతన్యరథం): సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సొంత భవనాల సమస్య వెంటాడుతోంది. కొన్నిచోట్ల ఎప్పుడో నిర్మించిన పాత భవనాలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వర్షానికి కురుస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు సొంత భవనాల నిర్మాణానికి కూటమి సర్కారు చర్యలు చేపట్టింది. ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన (పీఎం అజయ్) నిధులు రూ.18 కోట్లు కేటాయించిందిది. వైఎస్సార్ కడప జిల్లాలో ప్రొద్దుటూరు, కలసపాడు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో మనుబోలు, తిరుపతి జిల్లాలో చంద్రగిరి, చిత్తూరు జిల్లాలో పలమనేరు, గుడియాతంలతో కలిపి మొత్తం ఆరు భవనాలు నిర్మించనున్నారు. వంది మంది విద్యార్థులు వసతి పొందేందుకు ఒక్కో భవనానికి రూ.3 కోట్లు ఖర్చు చేసి ప్రొద్దుటూరు సంజీవనగర్, కలసపాడులో జీం1 తరహాలో భవన నిర్మాణాలు చేపట్టారు. సెప్టెంబర్ 2025 నుంచి జూన్ 2026లోపు భవనాలు పూర్తి చేయాలని గడువు ఉంది. అయితే క్షేత్ర స్థాయిలో ప్రొద్దుటూరులో పాడుబడిన ఎస్సీ బాలికల వసతి భవనాన్ని కూల్చివేశారు. ఆ స్థలంలో కొత్త భవనం చేపట్టారు. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్ పూర్తయి పై అంతస్తుకు పిల్లర్ల పనులు సాగుతున్నాయి. ఇదే మాదిరి కలసపాడు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిర్ణీత గడువులోపు భవనాలను పూర్తి చేసి వసతిగృహాలను అందుబాటులోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

# ఒంటిమిట్టలో నవమి బ్రహ్మోత్సవాల పనుల పరిశీలన

ఒంటిమిట్ట (చైతన్యరథం): వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ జేఈవో వల్లూరు వీరబ్రహ్మం తెలిపారు. ఒంటిమిట్టలో నిత్యాన్నదానం, కల్యాణ వేదికలో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. సీఈ సత్యనారాయణమూర్తి, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, నరసింహమూర్తి, అన్నదానం ప్రత్యేక అధికారి శాస్త్రిలతో పాటు అధికారులు పాల్గొన్నారు.






# ఇండియా ఏఐ సమ్మిట్‌కు అద్భుతమైన ఆదరణ

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'కు అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. ప్రదర్శనకారులు, సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. సమ్మిట్‌కు లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు కేంద్రం మొదట

## మరో రోజు పొడిగింపు

తెలిపింది. అయితే భారీ స్పందన వస్తుండడంతో 21వ తేదీ వరకు పొడిగించింది. అంతే కాదు.. ఎక్స్‌పో టైమింగ్స్‌లో కూడా మార్పులు చేసింది. సాయంత్రం ఆరు గంటలకు బదులుగా ఎనిమిది గంటల వరకు పొడిగించింది. ఇక ఈ సదస్సు కోసం 3 లక్షల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 2.5 లక్షల మంది సమిట్‌లో పాల్గొన్నారు. ఇందు కోసం కేంద్రం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసింది. మొత్తం పది వేదికల్లో 70వేల చదరపు మీటర్లకు పైగా విస్తరించిన ప్రాంతంలో స్టాళ్లు, స్టార్టప్‌లు, ఏఐ వేదికలు కనువిందు చేస్తున్నాయి. 13 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్టు తెలుస్తోంది.

# రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ ఖరారు

## ఈనెల 26న నోటిఫికేషన్... వచ్చేనెల 16న పోలింగ్..!

భారత ఎన్నికల సంఘం రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లో మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్ విడుదల చేయగా.. తెలంగాణలో రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. మార్చి 16న పోలింగ్ జరుగుతుంది. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి 7 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. తెలంగాణలో మరోసారి ఎన్నికల హడావుడి మొదలు కానుంది. ఖాళీగా ఉన్న రాజ్యసభ స్థానాలకు భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 37 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం పూర్తికానుండగా.. ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం తాజాగా షెడ్యూలు విడుదల చేసింది. తెలంగాణలోనూ రెండు స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. బీఆర్ఎస్ నుంచి కేఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ తరపున అభిషేక్ మను సింఘ్వీ తెలంగాణ నుంచి రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరి పదవీ కాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. దీంతో ఈ స్థానాలతో పాటు దేశవ్యాప్తంగా మరో 35 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ వెలువడనుంది. మార్చి 5 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. మార్చి 6న స్క్రూటినీ, 9 వరకు నామినేషన్ల విత్ డ్రాకు అవకాశం కల్పించారు. 16వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పార్లమెం టులో పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవు తుంది. మార్చి 20వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా రాజ్యసభ ఎన్నికలు ముగుస్తాయి. కాగా ఈ ఎన్నికలు రాష్ట్రాల అసెంబ్లీ సభ్యుల ఓట్ల ద్వారా జరుగుతాయి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఎక్కువగా ఉండటంతో ఖాళీ అయిన రెండు స్థానాలు కాంగ్రెస్సే దక్కించుకునే ఛాన్స్ ఉంది. మొత్తంగా 37 స్థానాలకు గాను అత్యధికంగా మహారాష్ట్రలో 7, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో 6 చొప్పున, బీహార్‌లో 4, ఒడిశా, అస్సాంల్లో 3 చొప్పున, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ల్లో 2 చొప్పున, హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లలో ఒక్కో స్థానానికి ఎన్నికలు జరుగుతాయి. మరోవైపు రాజ్యసభలో పట్టు కోసం ఈ ఎన్నికలు కేంద్రంలోని అధికార ఎన్డీయేకు కీలకం కానున్నాయి.



# మహిళ దుస్తులను లాగడమూ అత్యాచారయత్నమే: సుప్రీంకోర్టు !

**మహిళల రొమ్ములను తాకడం, వారి దుస్తులను లాగడం అత్యాచారం కిందకు రాదంటూ గతేడాది అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. దీనిపై కేంద్రం కూడా స్పందించింది. ఇటువంటి తీర్పులతో సమాజానికి ఎటువంటి సందేశం ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా.. ఈ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కింది కోర్టు తీరును తప్పుబట్టిన ధర్మాసనం దానిని రద్దుచేసింది. దాదాపు 15 ఏళ్ల కిందట యూపీలో ఈ ఘటన చోటుచేసుకుంది.**

మహిళల దుస్తులను లాగడం, వక్షోజాలను తాకడం అత్యాచారయత్నమేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. గతంలో బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారయత్నం కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఇచ్చిన వివాదాస్పద తీర్పుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. దుస్తులు లాగడం, వక్షోజాలను తాకడం అత్యాచారం కిందకు రాదంటూ హైకోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిని సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి విచారణ జరిపి.. నిందితులకు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే... నవంబరు 2021లో యూపీలోని కస్‌గంజ్‌కు చెందిన ఓ మహిళ, ఆమె 11 ఏళ్ల కుమార్తెతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి తల్లీకూతుకు తిరిగొస్తుండగా మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తారసపడ్డారు. బైక్‌పై ఆ బాలికను ఇంటి దగ్గర దింపుతామని చెప్పడంతో ఆమె వారి వెంట పంపింది. కానీ తోవలో ఆ చిన్నారిని అసభ్యంగా తాకుతూ ఓ కల్వర్టు కిందకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. ఆ బాలిక కేకలు వేసింది. ఆమె అరుపులు విని అటుగా వెళ్తున్నవారు అక్కడకు రావడంతో నిందితులు పరారయ్యారు. తర్వాత ఈ విషయమై బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదయ్యింది. అయితే, ఈ కేసులో మార్చి 17 2025 అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివాదాస్పద తీర్పు ఇచ్చారు. మహిళ వక్షోజాలను తాకడం, వారి దుస్తులు లాగినంత మాత్రాన అత్యాచారంగా పరిగణించలేమంటూ నిందితులపై ఉన్న కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. దీనిపై దేశవ్యాప్తంగా దుమారం రేగడంతో సుప్రీంకోర్టు ఈ అంశంపై తీవ్రంగా స్పందించి, సుమోటాగా విచారణ చేపట్టింది. బుధవారం నాటి విచారణలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడి త్రిసభ్య ధర్మాసనం.. అలహాబాద్ హైకోర్టు తీర్పును పక్కనబెట్టింది.

ఇటువంటి తీర్పులతో సమాజానికి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయని గత విచారణలో విచారం వ్యక్తం చేసింది. ఆ తీర్పుపై స్టే విధించిన సుప్రీంకోర్టు.. దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీచేసింది. ఈ క్రమంలోనే బుధవారం తీర్పు వెలువడింది. ఇటువంటి చర్యలు అత్యాచారం కిందకే వస్తాయని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.మహిళలపై లైంగిక నేరాలకు సంబంధించి సున్నితమైన కేసుల్లో న్యాయమూర్తులు సున్నితంగా వ్యవహరించాలని సీనియర్ న్యాయవాది హెచ్ఎస్ ఫూల్కా చేసిన విజ్ఞప్తిపై ధర్మాసనం స్పందిస్తూ "కోర్టును ఆశ్రయించే పిటిషనర్ ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు, ఇబ్బందులను పరిగణలోకి తీసుకోకుండా వ్యవహరిస్తే ఏ న్యాయమూర్తి లేదా ఏ కోర్టు తీర్పు కూడా పూర్తి న్యాయం చేస్తుందని ఆశించలేం" అని పేర్కొంది. "తీర్పులు ఇచ్చే సమయంలో కేవలం రాజ్యాంగ, న్యాయ సూత్రాలపైనే ఆధారపడకుండా.. కరుణ, దయ వంటి వాతావరణాన్ని ప్రోత్సహించాలని, ఈ రెండు మూల స్తంభాలు లేకుంటే న్యాయవ్యవస్థలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేవు" అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు."సాధారణ పౌరులు అనుసరించే నియమాలను నిర్ణయించడం నుంచి ఏదైనా కేసులో తుది తీర్పు ఇచ్చే వరకు... న్యాయ ప్రక్రియలో భాగస్వాములుగా మనం తీసుకునే ప్రతి నిర్ణయంలో మానవత్వం, జాలి, కరుణ, అవగాహన అనే విలువలు ప్రతిబింబించాలి.. న్యాయవ్యవస్థ పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలంటే ఈ విలువలు ముఖ్యం" అని తేల్చి చెప్పారు.



# కేరళ కంపెనీ సర్‌'ప్రైజ్'

## ఉద్యోగులకు రూ.20 కోట్ల విలువైన కార్ల నజరానా

దీపావళి పండుగ సమయంలో అనే కంపెనీలు తమ ఉద్యోగులకు బోనస్‌లు, ఖరీదైన వస్తువులను కానుకగా అందజేస్తాయి. అయితే ఓ సంస్థ తన 30వ వార్షికోత్సవం వేళ ఉద్యోగులకు అదిరిపోయే శుభవార్త చెప్పింది. ఇన్నేళ్లుగా సంస్థను నమ్ముకుని, అభివృద్ధికి అహర్నిశలూ పనిచేసిన వారికి గుర్తింపు లభించింది. వార్షికోత్సవ వేడుకలు నిర్వహించి లగ్జరీ కార్లును ఉద్యోగులకు అందించిన వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. అదే కేరళకు చెందిన రిటైల్ స్పేస్ హైలైట్ గ్రూప్.సంస్థ కోసం పాటు పడుతున్న సిబ్బందికి దీపావళి వంటి పండగలు, ప్రత్యేక సందర్భాల్లో యాజమాన్యం కానుకలు ఇస్తుంది. వార్షిక, పండగ బోనస్‌లను ఇచ్చి ఉద్యోగులను సంతోషపెడుతుంటారు. కానీ తమ సంస్థను విజయవంతంగా నడిపించడంలో ఉద్యోగులు చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఓ కంపెనీ ఆశ్చర్యపోయే నిర్ణయం తీసుకుంది. అంకితభావంతో పనిచేసి, సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన ఉద్యోగులకు యాజమాన్యం సర్‌ప్రైజ్ ఇచ్చింది. రూ.20 కోట్లతో 47 కార్లును కొనుగోలు చేసిన ఉద్యోగులకు కానుకగా అందజేసింది. కేరళకు చెందిన హైలైట్ గ్రూప్ ప్రారంభమై మూడు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఉద్యోగులకు కార్లను బహుమతిగా ఇచ్చింది.రిటైల్ స్పేస్ రంగంలో కేరళలోనే అగ్రగామిగా ఉన్న ఈ సంస్థను 1996లో స్థాపించారు. కంపెనీ ఏర్పాటుచేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాలికట్‌లో వేడుకలను నిర్వహించింది. ఉద్యోగులకు ఖరీదైన కార్లను గిఫ్ట్‌గా ఇచ్చింది. కంపెనీ ప్రారంభం నుంచి పనిచేస్తోన్న 47 మంది ఉద్యోగులకు రూ.20 కోట్ల విలువైన కార్లను అందజేసింది. ఇందులో రేంజ్ రోవర్, లాండ్ రోవర్ డిఫెండర్, ఆడీ క్యూ8, టాటా హ్యారియర్, కియా సెల్టాస్, హ్యుందయ్ క్రెటా, స్కోడా వంటి మోడళ్లు ఉన్నాయి. దీంతో పాటు 2030 నాటికి సంస్థను మరింత విస్తరించి లక్షల మందికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని హైలైట్ గ్రూప్ యాజమాన్యం ప్రకటించింది.ఐటీ పార్కులు, కమర్షియల్ హబ్‌లు, ఇంటిగ్రేటెడ్ అర్బన్ ఎకోసిస్టమ్స్ ద్వారా ప్రపంచ పెట్టుబడి, వ్యాపార పటంలో కేరళను నిలిపేందుకు దోహదం చేస్తుందని హైలైట్ గ్రూప్ సీఈవో అజిల్ ముహమ్మద్ అన్నారు. ప్రపంచ ఆర్థిక పటంలో కేరళను ఉన్నత స్థానంలో నిలబెట్టడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కంపెనీకి త్రిశూర్, కాలికట్‌లలో విలాసవంతమైన మాల్స్ ఉండగా.. మరో 10 అభివృద్ధి దశలో ఉన్నాయి. మొత్తం 10వేల మంది ఇందులో పనిచేస్తున్నారు. త్వరలోనే 680 మిలియన్ డాలర్ల వ్యయంతో భారీ ట్రేడ్ సెంటర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది.

# భారత్ సాయం మాకెంతో ముఖ్యం

## ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరెస్



అంతర్జాతీయ సమాజం అభ్యున్నతికి శాశ్వత ప్రాతిపదికన భారత్ అందిస్తున్న సహాయం తమకెంతో ముఖ్యమైనదని ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ అన్నారు. ఇప్పుడు ప్రపంచంలో భారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలక పాత్రను పోషించే అత్యంత సానుకూల ట్రెండ్ నడుస్తోందని ఆయన చెప్పారు. గ్లోబల్ సౌత్ దేశాల పరిధిలో తొలిసారిగా భారత్ నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్-2026 సదస్సులో పాల్గొనేందుకు అమెరికాలోని న్యూయార్క్ నుంచి బయల్దేరే ముందు ఆయన ఒక ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుటెరెస్ ఈ కామెంట్స్ చేశారు.

**భారత్‌కు ఐరాస సదా రుణపడి వుంది**

ప్రపంచ శాంతి భద్రతలు, వికాసం సహా అన్ని ఐక్యరాజ్యసమితి విభాగాల్లో భారత్ అత్యంత ముఖ్యమైన పాత్రను పోషిస్తోందని గుటెరెస్ కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఐరాస నిర్వహిస్తున్న పీస్ కీపింగ్ మిషన్లలో అత్యధికంగా ఐదువేల మంది భారత భద్రతాదళ సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఇందుకోసం భారత్‌కు ఐరాస సదా రుణపడి ఉంటుందన్నారు. 2007లో లైబీరియాలో పీస్ కీపింగ్ మిషన్ కోసం పూర్తిగా మహిళలతో కూడిన తొలి పోలీస్ యూనిట్‌ను అందించిన ఘనత భారత్‌కే దక్కుతుందని చెప్పారు. జీ-20 కూటమి సదస్సును భారత్ నిర్వహించిన సమయంలోనే పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారత్ చొరవ వల్లే గ్లోబల్ సౌత్‌కు మేలు చేసే నిర్ణయాలను ఆ సదస్సులో తీసుకోవడం సాధ్యమైందన్నారు.

**యావత్ ప్రపంచంలో సంక్షోభాలు, అన్యాయాలు, అసమానతలు వున్నాయి**

'ఇప్పుడు యావత్ ప్రపంచంలో సంక్షోభాలు, అన్యాయాలు, అసమానతలు, పేదరికం, ఆకలి పెరుగుతున్నాయి. ఇవి ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సమస్యలకు మనం నేటికీ పరిష్కారాల్ని కనుగొనలేకపోయాం. మరోవైపు చాలా దేశాల్లో ఉగ్రవాద భూతం వేళ్లూనుకుంటోంది. దానివల్ల ఆయా దేశాలు అభివృద్ధి సాధించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో యావత్ ప్రపంచం ఐక్యరాజ్యసమితి వైపు చూస్తోంది. నేను ఒక విషయాన్ని సూటిగా చెప్పదలిచాను. యూఎన్ అంటే కేవలం భద్రతా మండలి కాదు. ఇందులో 193 దేశాలకు ప్రాతినిధ్యం ఉంది. ఈ అన్ని దేశాలకూ సమానమైన ప్రాధాన్యత ఉంటుంది' అని స్పష్టం చేశారు.

**రాష్ట్రపతి, ప్రధానితో భేటీ**

ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరెస్ తన పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీలతో భేటీ అవుతారు. ఏఐ ఇంపాక్ట్-2026 సదస్సులో పాల్గొనే అంతర్జాతీయ స్థాయి టెక్ కంపెనీల ప్రముఖులతోనూ సమావేశమవుతారు. ఐరాస ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ సైంటిఫిక్ ప్యానల్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగ సభ్యులతో ఢిల్లీలో సమీక్షిస్తారు.

# యూట్యూబ్ డౌన్!

**షాక్ తిన్న లక్షలాది మంది యూజర్లు - డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ**




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో అంతరాయం నెలకొంది. మొబైల్, కంప్యూటర్లలో యూట్యూబ్ ఓపెన్ చేస్తే something went wrong అని చూపించడంతో యూజర్లు షాక్ తిన్నారు. చాలా మందికి యూట్యూబ్ వీడియోలు డౌన్‌లోడ్ కాలేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఫిర్యాదులు చేశారు.

ఒక్క అమెరికాలోనే 3 లక్షల మందికి పైగా యూజర్లు డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదులు చేయడం గమనార్హం. దీనిపై స్పందించిన యూట్యూబ్ యాజమాన్యం.. స్ట్రీమింగ్‌లో కొన్ని సమస్యలు ఎదురవుతున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. సమస్య పరిష్కారానికి తమ టెక్ టీమ్‌లు పని చేస్తున్నాయని పేర్కొంది. సెర్చ్ రిజల్ట్, వీడియోలు ప్లే కావట్లేదని భారత్ నుంచి 18 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయని యూట్యూబ్ యాజమాన్యం తెలిపింది.

# శ్రీలంక కీలక నిర్ణయం

**- పార్లమెంటు సభ్యుల పెన్షన్ రద్దు!**



మన పొరుగు దేశం శ్రీలంక కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంటు సభ్యులకు పెన్షన్ రద్దు చేయడం ద్వారా ఆదర్శంగా నిలిచింది. ఈ అంశం ప్రస్తుతం భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లో చర్చకు దారితీసింది.

శ్రీలంక సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల పెన్షన్లను రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందింది. 225మంది సభ్యులు ఉన్న శ్రీలంక పార్లమెంటులో 154మంది సదరు బిల్లును సమ్మతిస్తూ ఓటేయడం గమనార్హం. కేవలం ఇద్దరు మాత్రమే బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. మిగతావారు ఓటింగ్‌లో పాల్గొనలేదు.

శ్రీలంక దేశంలో ఐదు సంవత్సరాలు ఎంపీగా ఉన్నవారికి పెన్షన్ అందుతోంది. కాగా కొత్త చట్టం ఆమోదం వల్ల ఇప్పటికే పెన్షన్ అందుకుంటున్న వారితో పాటు కొత్తవారికి కూడా ఇకపై పెన్షన్ అందదు. మాజీ అధ్యక్షులకు ఇచ్చే ప్రయోజనాలను దిసనాయకే సర్కారు ఇప్పటికే ఆపేసింది. ఇంటి అద్దె, అలవెన్సులు, పెన్షన్లు, రవాణా భత్యం, సౌకర్యాలను 2025 సెప్టెంబరులోనే రద్దు చేయడం గమనార్హం.

**కుదేలైన పర్యాటక రంగంతో..**

పర్యాటక రంగంపై ఆధారపడిన శ్రీలంకకు కొవిడ్, ఉగ్రవాద దాడులతో పర్యాటకుల (విదేశీయుల) రాకపోకలు తగ్గాయి. దీనికి తోడు పాలకుల ఆర్థిక నిర్వహణ అసమర్థత వల్ల 2022లో దివాళా తీసింది. ఈ క్రమంలో ప్రజలు తిరగబడటంతో అప్పటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజీనామా చేశారు.

అనంతరం ఎన్నికలు నిర్వహించగా మార్క్సిస్టు నాయకుడు దిసనాయకే గెలుపొంది అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టేందుకు పాలకుల పెన్షన్ల రద్దు బిల్లును ప్రవేశపెట్టారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు చట్టసభ సభ్యులకు పెన్షన్లు తీసుకోవడం సరికాదంటూ చర్చ సందర్భంగా న్యాయ శాఖ మంత్రి హర్షణ నానాయక్కర స్పష్టం చేశారు.

# ఇమ్రాన్ హత్యకు కుట్ర

**మమ్మల్ని మొహ్సిన్ బెదిరిస్తున్నారు**
**మాజీ ప్రధాని సోదరీమణుల ఆరోపణ**



పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ హత్యకు కుట్ర జరుగుతోందని ఆయన తోబుట్టువులు సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ తమను బెదిరిస్తున్నారని ఇమ్రాన్‌ఖాన్ సోదరీమణులు ఉజ్మాఖాన్, అలీమాఖాన్ తెలిపారు. 'వారు నన్ను చంపుతారు. నా హత్యకు వారు పథకం వేశారు' అని ఇమ్రాన్ తమతో జరిపిన సంభాషణలను మీడియాకు వినిపించారు.

'మొహ్సిన్ మమ్మల్ని బెదిరిస్తున్నాడు. మాకు కానీ, మా సోదరుడికి కానీ ఏమైనా జరిగితే ఎవరినీ వదిలిపెట్టం' అని ఉజ్మా ఖాన్, అలీమాఖాన్ హెచ్చరించారు. ప్రస్తుతం పాకిస్థాన్ జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ తీవ్ర అనారోగ్యంతో సతమతమవుతున్నారు. చీకటి జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉండడంతో ఆయన కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని పాక్ సుప్రీంకోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో వెల్లడైంది. ఇమ్రాన్ కుడి కన్ను చూపు 85 శాతం కోల్పోయినట్టు వార్తలు వచ్చాయి. దీంతో ఆయనకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. కాగా, ఇమ్రాన్‌ఖాన్‌కు మెరుగైన వైద్యం అందించాలని పలువురు దిగ్గజ క్రికెటర్లు పాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్‌కు వైద్య సదుపాయం కల్పించేందుకు పాక్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# హర్మూజ్ జలసంధి

**అమెరికాపై పవర్‌ఫుల్ అస్త్రాన్ని బయటకు తీసిన ఇరాన్!**




ఇరాన్, అమెరికా మధ్య ఒమన్ మధ్యవర్తిత్వంతో జెనీవా వేదికగా రెండో విడత చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. దీంతో రెండు దేశాల మధ్య మరోసారి మాటల యుద్ధం తారస్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో అమెరికా యుద్ధ నౌకలు పశ్చిమాసియా దిశగా పయనిస్తున్నట్టు ట్రంప్ చేసిన బెదిరింపులకు ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఆ నౌకలు ప్రమాదకరమే కానీ.. వాటిని సముద్రంలో ముంచేసే ఆయుధాలు కూడా అత్యంత ప్రమాదకరమని ఖమేనీ కౌంటర్ ఇచ్చారు.

అమెరికాకు చెందిన రెండు యుద్ధ నౌకలు పశ్చిమాసియా దిశగా కదలుతుండగా.. ఇరాన్ సమీపంగా 50కిపైగా యుద్ధ విమానాలను అమెరికా మోహరించింది. అటు ఇరు దేశాల ప్రతినిధుల మధ్య జెనీవా వేదికగా అణు ఒప్పందంపై జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండా మూడు గంటల్లోనే ముగిశాయి. ఇది జరిగిన కొద్దిసేపటికే హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసి క్షిపణి విన్యాసాలను నిర్వహించింది. దీంతో ఇరాన్, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. యుద్ధ నౌకలు తమ తీరం దిశగా వస్తుండటంతో అమెరికాకు.. ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది.

భారీ యుద్ధ నౌకలు ప్రమాదకరమే కానీ.. అవి సముద్రంలో మునిగిపోయే అవకాశం ఉందని అమెరికాకు ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా అలీ ఖమేనీ వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచంలోనే శక్తివంతమైన సైన్యం ఉన్నవారికి ఎదురుదెబ్బలు తగిలే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. అమెరికా నౌకాదళానికి చెందిన యూఎస్ఎస్ అబ్రహాంలింకన్ ప్రస్తుతం ఇరాన్ తీరానికి 700 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు గుర్తించారు. మరొకటి పశ్చిమాసియాలో అమెరికా సైన్యాలకు మద్దతుగా గల్ఫ్ తీరానికి బయలుదేరింది. ఈ క్రమంలోనే ఖమేనీ తీవ్రంగా స్పందించారు.

ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఎప్పటికీ విజయవంతం కావని ట్రంప్‌నకు ఖమేనీ కౌంటర్ ఇచ్చారు. "ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం తమదని అమెరికా అధ్యక్షుడు అంటున్నారు. కానీ, ఒక్కోసారి కోలుకోలేనంత దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఇరాన్ దిశగా యుద్ధ నౌకలను పంపుతున్నామని ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారు. అవి నిజంగా ప్రమాదకరమైనవి. అయితే వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యం కలిగిన ఆయుధం మరింత ప్రమాదకరం.. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను 47ఏళ్లుగా ఏమీ చేయలేకపోయామని అమెరికా ఒప్పుకోవడం శుభపరిణామం. ఎప్పటికీ మమ్మల్ని ఏమీ చేయలేరు. అణు చర్చలు జరుపుదామని పిలుపుస్తున్నారు... కానీ చివరకు మీ దగ్గర అణ్వస్త్రాలు ఉండకూడదంటున్నారు. ముందుగానే చర్చల ఫలితాలను నిర్ధారించడం తప్పిదం, మూర్ఖత్వమే" అని ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ ఎక్స్ (ట్విట్టర్)లో వరుస ట్వీట్లు చేశారు.

స్పోర్ట్స్

చైతన్యరథం

# దూబె దూకుడు..నెదర్లాండ్స్‌పై ఘనవిజయం






టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో గెలుపొందింది. నెదర్లాండ్స్ జట్టు ఆఖరి వరకు పోరాడి ఓడింది. 194 పరుగుల లక్ష్య ఛేదనకి దిగిన నెదర్లాండ్స్.. నిర్ణీత 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. ఆఖరిలో క్రోస్(25లి; 12 బంతుల్లో 5 ఫోర్లు) బౌండరీలతో మెరిశాడు. నెదర్లాండ్స్ బ్యాటర్లలో బాస్ డీ లీడె(33) టాప్ స్కోరర్. లెవిట్(24), మ్యాక్స్(20), అకెర్మ్యాన్ (23), ఎడ్వర్డ్స్(15), లయన్(26), క్రోస్(25), వాన్ బీక్(4) పరుగులు చేశారు. టీమిండియా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3, దూబె 2, బుమ్రా, హార్దిక్ పాండ్య తలొక వికెట్ పడగొట్టారు. అంతకుముందు తొలుత భారత్ బ్యాటింగ్ చేయగా నెదర్లాండ్స్ బౌలర్లు చక్కని బౌలింగ్‌తో ఆరంభంలో కట్టడి చేసినప్పటికీ చివర్లో శివమ్ దూబె చెలరేగడంతో టీమిండియా భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసింది. శివం దూబే(66; 31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సలు) హాఫ్ సెంచరీతో చెలరేగాడు. వరుసగా మూడో మ్యాచ్‌లో కూడా ఓపెనర్ అభిషేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఇషాన్ కిషన్ (18) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన బౌలర్ ఆర్యన్ దత్ (2/19) ఓపెనర్లు ఇద్దరినీ ఔట్ చేశాడు. ఆ తర్వాత తిలక్ వర్మ (31), కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (34) వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా రు. వీరు అవుటైన తర్వాత దిగిన శివమ్ దూబె, హార్దిక్ పాండ్యా (30) స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ఆరు సిక్సలు, నాలుగు ఫోర్లు బాదాడు. టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేయగలిగింది. నెదర్లాండ్స్ ఎదుట 194 పరుగుల టార్గెట్ ఉంచింది.

# టాప్ 10లోకి దూసుకొచ్చిన ఇషాన్ కిషన్



టీమిండియా స్టార్ బ్యాటర్ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ అద్భు తమైన ఫామ్‌తో అదరగొడుతున్నాడు. టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా వరుసగా రెండు హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. పాకిస్థాన్‌పై 40 బంతుల్లోనే 77 పరుగులు చేసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. అయితే ఈ ప్రదర్శనతో తాజాగా ఐసీసీ విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్ జాబితాలో టాప్ 10లోకి దూసుకొచ్చాడు. 732 రేటింగ్ పాయింట్లతో ఎనిమిదో స్థానానికి ఎగబాకాడు. పలు అనివార్య కారణాల వల్ల దాదాపు రెండేళ్లుగా భారత జట్టుగా ఇషాన్ దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత దేశవాళీల్లో నిలకడగా రాణిస్తూ అద్భుతమైన ఫామ్ కనబ రుస్తుండటంతో భారత సెలెక్టర్లు ఇషాన్ వైపు చూశారు. దీంతో న్యూజిలాండ్‌తో సిరీస్‌తో ఇషాన్ రీ ఎంట్రీ ఇచ్చాడు. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించాడు. ఇదిలా ఉంటే.. ఈ టోర్నీలో వరుసగా రెండు సార్లు డకౌట్ అయినప్పటికీ అభిషేక్ శర్మ మాత్రం 891 పాయింట్లతో అగ్రస్థా నంలోనే కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ ఫిల్ సాల్ట్ 808 పాయింట్లతో ఉన్నాడు. కాగా భారత్ తరఫున టాప్-10లో తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ కొనసాగుతున్నా రు. శ్రీలంక బ్యాటర్ నిస్సాంక ఆస్ట్రేలియాపై శతకంతో మూడో స్థానానికి ఎగబాకడం విశేషం.

### బౌలర్లలో వరుణ్ ఆధిపత్యం

ఐసీసీ బౌలింగ్ జాబితాలో భారత్ స్టార్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. జింబాబ్వే బౌలర్ బ్రాడ్ ఎవాన్స్ 10 స్థానాలు ఎగబాకి ఐదో స్థానానికి చేరాడు. ఇతర భారత బౌలర్లలో అక్షర్ పటేల్(14), బుమ్రా (15), అర్ష్‌దీప్ సింగ్ (16) స్థానాల్లో ఉన్నారు.

# మ్యాచ్‌కు ముందు అంట్లు తోమాం

### పాక్ హాకీ జట్టు కెప్టెన్ షకీల్ అహ్మద్ బట్



పాకిస్థాన్ హాకీ జట్టు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ సందర్భంగా ఆస్ట్రేలి యా పర్య టనకి వెళ్లిన సంగతి తెలిసిందే. వెళ్లిన నాటి నుంచి ఏదో ఒక అంశంతో నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. కనీస సౌకర్యాలకు నోచుకోకుండా తీవ్ర ఇబ్బందులతో పాక్ ఆటగాళ్లు అక్కడ గడిపా రు. అయితే తిరిగి వచ్చిన తర్వాత పాక్ హాకీ జట్టు కెప్టెన్ షకీల్ అహ్మద్ బట్ జాతీయ సమాఖ్యపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించాడు. ఆ పర్యటనలో సరైనా వసతి లేకపోవడంతో వీధుల్లో తిరిగాల్సి వచ్చిందని ఆరోపించాడు. ఈ మేరకు అతడు లాహోర్ ఎయిర్ పోర్ట్‌లో మీడియాతో మాట్లాడాడు. 'దయనీయమైన విషయం ఏంటంటే.. మేం అక్కడ 13 రోజులు ఉండాల్సి వచ్చినప్పు డు కేవలం 10 రోజులకే వసతి ఏర్పాటు చేశారు. పది రోజుల తర్వాత మేము చౌకైన నివాసంలోకి మారాము. మ్యాచ్‌కు ముందు కిచెన్ శుభ్రం చేసి, గిన్నెలు కడిగి ఆటకు వెళ్లే వాళ్లం. ఈ విషయా లు మీడియాతో మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పాక్ హాకీ సమాఖ్య అధికారులు ఆటగాళ్లను హెచ్చ రించారు. మేము ఆటలో ముందుకు సాగాలంటే విదేశీ కోచ్ అవసరం. జట్టులో మంచి ప్లేయర్లు ఉన్నారు. కానీ ప్రస్తుత మేనేజ్‌మెంట్‌తో ముందుకు సాగలేం. ఇలాంటి పరిస్థితుల్లో మా నుంచి ఇంతకు మించి ఎలాంటి ఫలితాలు ఆశిస్తారు' అని హాకీ జట్టు కెప్టెన్ బట్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండగా ఆస్ట్రేలియాతో ఆడిన తొలి మ్యాచ్‌లో పాక్ జట్టు 2-3 తేడాతో ఓడిపోయింది. అలాగే జర్మనీ చేతిలోనూ ఓటమిని చవి చూసింది. పాకిస్థాన్ హాకీ జట్టు ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాకు బయలుదేరే ముందు సిడ్నీ విమానా శ్రయంలో 14 గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చినట్లు తెలుస్తోంది.

# ఫర్హాన్ సూపర్ సెంచరీ..పాక్ ఘనవిజయం

పొట్టి ప్రపంచ కప్‌లో భాగంగా కొలంబో వేదికగా పాకిస్థాన్-నమీబియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పాక్ ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి



బ్యాటింగ్‌కు దిగిన పాక్.. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పో యి 199 పరుగులు చేసింది. ఓపెనర్ ఫర్హాన్(100; 58 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్సలు) సూపర్ సెంచరీతో అదరగొ ట్టాడు. పాక్.. నమీబియాకు 200 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిం చింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 97 పరుగు లకే చేతులెత్తేసింది. ఉస్మాన్ తారిఖ్ 4, షాదాబ్ ఖాన్ 3 వికెట్లు తీశారు. కాగా పాక్ బ్యాటర్లలో సల్మాన్ అఘా(38; 23 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సలు) రాణించా డు. సయూబ్ ఆయుబ్ (14), ఖవాజా(5) విఫలమయ్యారు. షాదాబ్ ఖాన్(36; 22 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సలు) నాటౌట్‌గా నిలిచాడు. నమీబి యా బౌలర్ల లో జాక్ బ్రెస్సేల్ 2, ఎరాస్మస్ 1 వికెట్ పడగొట్టారు. కాగా ఈ గెలుపుతో పాకిస్థాన్ సూపర్ 8కు చేరింది.

# సౌతాఫ్రికా అలవోక విజయం




టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఢిల్లీ లోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా యూఏఈతో జరిగి న మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. 123 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రొటీస్.. 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. కెప్టెన్ మార్క్రమ్(28; 11 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), బ్రెవిస్(36; 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సలు) చెలరేగి ఆడా రు. ర్యాన్ రికెల్టన్(30) రాణించాడు. ఓపెనర్ డికాక్(14), స్టబ్స్(6), జాసన్ స్మిత్(3) పరుగులు చేశారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ, జవాదుల్లా, అర్ఫాన్, ఫారుఖ్ తలో వికెట్ తీసుకున్నారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఈఏ.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. యూఏఈ బ్యాటర్లలో అలీషన్ షరాఫు (45; 38 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్స్) బ్యాటింగ్‌లో రాణించాడు. మహ్మద్ వసీమ్ (22) ఫర్వాలేద నిపించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కార్బిన్ బోష్ 3, అన్రిచ్ నోర్జె 2, జార్జి లిండే 1 వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.



# రంజీ ట్రోఫీ ఫైనల్‌కు జమ్మూకశ్మీర్

### - పశ్చిమబెంగాల్‌పై ఘనవిజయం
### - 67 ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి

జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. 67 ఏళ్ల ఆ జట్టు చరిత్రలో తొలిసారి రంజీ ట్రోఫీలో ఫైనల్‌కు చేరింది. సెమీ ఫైనల్‌లో బెంగాల్ జట్టును ఓడించి.. జమ్మూకశ్మీర్ ఫైన ల్‌కి ప్రవేశించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జమ్మూకశ్మీర్ జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన బెంగాల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 328 పరుగులు చేసింది. బెంగాల్ బ్యాటర్లలో సుదీప్ కుమార్ ఘరామి (146) శతకంతో ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూకశ్మీర్ 302 పరుగులకే ఆలౌటైంది. అబ్దుల్ సమద్(82), పరాస్ డోగ్రా (58) రాణించారు. దీంతో బెంగాల్ జట్టు 26 పరుగుల స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. భారత జట్టు పేసర్ మహమ్మద్ షమీ బెంగాల్ తరఫున విజృంభించాడు. అతడు 90 పరుగులు ఇచ్చి 8 వికెట్లు సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్లు హోరా హోరీగా పోటీ పడ్డాయి. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జమ్మూకశ్మీర్ పేస్ దాటికి బెంగాల్ బ్యాటర్లు బెంబేలెత్తారు. దీంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 99 పరుగులకే కుప్పకూలింది. షాబాజ్ అహ్మద్ 24 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక జమ్మూకశ్మీర్ బౌలర్లు ఔకిబ్ నబీ, సునీల్ కుమార్ చెరో నాలుగు వికెట్లు తీసి.. బెంగాల్ పతనాన్ని శాసించారు. అలానే యుద్వీర్‌సింగ్ చరక్ 2 వికెట్లు తీసుకున్నాడు. ఇక 126 పరుగుల టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్మూ కశ్మీర్ నాలుగు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. జమ్మూకశ్మీర్ బ్యాటర్లలో వంశజ్ శర్మ (84 బంతుల్లో 43 పరుగులు) అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించా డు. అబ్దుల్ సమద్(30), శుభమ్ పుండిర్ (27) ఫర్వాలేదనిపించారు.

శుభమ్ ఖజురియా (1), యావెర్ హసన్ (6), కెప్టెన్ పరాస్ డోంగ్రా (9) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ 3 సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు సాధించిన మహ్మద్ షమీ.. రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 1 వికెట్ మాత్రమే తీసుకున్నాడు. ఇక బెంగాల్‌పై విజయంతో జమ్మూకశ్మీర్ హిమాలయ ప్రాంతం నుంచి ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా అవతరించింది. జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి 1959-60 సీజన్‌లో రంజీ ట్రోఫీలో పాల్గొంది. ఆ తర్వాత నుంచి ఎక్కడ గట్టిపోటీ ఇచ్చే జట్టుగా జమ్మూకశ్మీర్ కనిపించ లేదు. అయితే దశాబ్దాల తర్వాత 2013-14 సీజన్‌లో తొలిసారిగా నాకౌట్‌లకు అర్హత సాధించారు. ఈ సీజన్‌లో మరో సెమీఫైనల్‌లో కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్లు తలపడుతు న్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుతో జమ్మూ కశ్మీర్ ఫిబ్రవరి 24న ప్రారంభం కానున్న ఫైనల్‌లో తలపడనుంది.

# సత్యదేవ్ కొత్తప్రాజెక్టు



యువ నటుడు సత్యదేవ్ హీరోగా 15వ చిత్రం బుధవారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో వైభవంగా ప్రారంభమైంది. లక్ష్మీనారాయణ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రాన్ని త్రిషూల్ విజినరీ స్టూడియోస్ పతాకంపై నరేంద్రరెడ్డి నిర్మిస్తున్నారు. సినిమాలో సత్యదేవ్‌కు జోడీగా 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా నటిస్తుండగా, ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల ఈ సినిమాతో పూర్తిస్థాయి సంగీత దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుకకు సినీ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్నేహం నేపథ్యంలో సాగే పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం 'రావుబహదూర్', 'గరుడ చాప్టర్-1'వంటి వైవిధ్యమైన సినిమాలతో బిజీగా ఉన్న సత్యదేవ్, ఈ కొత్త ప్రాజెక్టుతో మరో ఆసక్తికరమైన జోనర్‌లో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

# అలా ఇబ్బందిపడ్డాను..!



మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి తన అనారోగ్యంపై వస్తున్న వార్తలపై తొలిసారి స్పందించాడు. గత ఏడాది జూన్‌లో అనారోగ్యానికి గురై దాదాపు నాలుగు నెలలపాటు సినిమాలకు విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో తాను రుచి, వాసన చూసే శక్తిని కోల్పోయానని, ఇప్పుడిప్పుడే నెమ్మదిగా ఇంద్రియ జ్ఞానాన్ని తిరిగి పొందుతున్నానని తెలిపారు.కంటి చూపు,వినికిడితోపాటు శ్వాస తీసుకునేటప్పుడు వాసనను గుర్తించగలగడం కూడా ఒక గొప్ప వరమని, అటువంటి సామర్థ్యాలను కోల్పోయినప్పుడే వాటి విలువ అర్థమవుతుందని భావోద్వేగంగా మాట్లాడారు. ముఖ్యంగా వినికిడి శక్తిలేని వారి బాధ వర్ణనాతీతమన్నారు. ప్రస్తుతం మమ్ముట్టి పూర్తి ఆరోగ్యంతో తిరిగి షూటింగ్‌లలో బిజీ అయ్యారు. మహేష్ నారాయణన్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'పేట్రియాట్' సినిమా కోసం మమ్ముట్టిఇటీవలే డబ్బింగ్ పూర్తి చేశారు. మలయాళ చిత్ర పరిశ్రమలో ఈ సినిమా ప్రత్యేక మైలురాయిగా నిలవనుంది. సుమారు 18 ఏళ్ల తర్వాత మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి పూర్తిస్థాయి పాత్రల్లో స్క్రీన్‌ను పంచుకుంటున్నారు. వీరిద్దరితోపాటు విలక్షణ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్‌గా నటిస్తుండటం విశేషం. నయనతార, కుంచాకో బోబన్ ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# స్క్రిప్ట్ పనుల్లో 'లోక చాప్టర్ 2'



మన ఇండియన్ సినిమా దగ్గర ఈ కొన్నేళ్ల గ్యాప్‌లోనే సూపర్ హీరో జానర్ సినిమాలు ఊపందుకుంటున్నాయి. ఇలా మలయాళ సినిమానుంచి గత ఏడాది వచ్చిన లేడీ సూపర్ హీరో చిత్రమే 'లోక చాప్టర్ 1: చంద్ర'. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శని మెయిన్ లీడ్‌లో నటించిన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించి మలయాళ ఇండస్ట్రీ దగ్గర బిగ్గెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. ఇక ఈ చిత్రానికి దర్శకుడు డామినిక్ అరుణ్ సాలిడ్ సీక్వెల్ చిత్రాన్ని భారీ తారాగణంతో సెట్ చేయగా పార్ట్-2పై కూడా మంచి బజ్ నెలకొంది. ఇక ఈ సినిమాపై లేటెస్ట్‌గా లేడీ సూపర్ హీరో గాళ్ క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని, అన్నీ సెట్ అయితే ఈ ఏడాది సెప్టెంబర్ నెలనుంచే షూటింగ్ మొదలు కావచ్చని ఆమె క్లారిటీ ఇచ్చింది. సో ఇది మాత్రం ఈ సినిమా ఫ్యాన్స్‌కి ఇంకా కళ్యాణి అభిమానులకి ఒక గుడ్ న్యూస్ అనే చెప్పాలి. ఇక పార్ట్-2లో ఆమెతోపాటుగా టోవినో థామస్, దుల్కర్ సల్మాన్ ఇంకా మమ్ముట్టి కూడా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని కూడా దుల్కరే నిర్మాణం వహిస్తున్నారు.

# టైటిల్.. బ్రూస్‌లీ అట!

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ ప్రస్తుతం జోర్డాన్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్ పెట్టాలని మేకర్స్ భావిస్తున్నారు. అయితే, తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో కొత్త టైటిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నిర్మాత రవి యలమంచిలి గతంలోనే 'డ్రాగన్' అనేది కేవలం వర్కింగ్ టైటిల్ మాత్రమేనని, ఫైనల్ టైటిల్ ఇంకా ఫిక్స్ చేయలేదని హింట్ ఇచ్చారు. ఇప్పుడు తాజాగా ఈ చిత్రానికి 'బ్రూస్ లీ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, ఇది ఒక సంచలన నిర్ణయం అవుతుంది. ఎందుకంటే 2015లో రామ్ చరణ్ హీరోగా 'బ్రూస్ లీ :ది ఫైటర్' అనే సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. దశాబ్దం తర్వాత అదే టైటిల్‌ను ఎన్టీఆర్ -నీల్ ప్రాజెక్ట్ కోసం వాడుతారా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం జోర్డాన్ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ మునుపెన్నడూ చూడని రీతిలో కొత్త లుక్‌లో కనిపించనున్నారు. రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్, మలయాళ స్టార్ టోవినో థామస్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్టు సమాచారం.

# సుహాస్‌కు మరో షాక్

వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్ నటిస్తున్న తాజా కామెడీ డ్రామా 'హే భగవాన్'. ఈ సినిమా టైటిల్‌ను ఇటీవల 'హే బలవంత్'గా మార్చారు మేకర్స్. ఇక ఇప్పటికే అన్ని పనులు ముగించుకున్న సినిమా ఫిబ్రవరి 20న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతుంది. పక్కా కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న సినిమాకు సెన్సార్ బోర్డ్ తాజాగా మరో షాక్ ఇచ్చింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. సుహాస్ కెరీర్‌లో ఏ సర్టిఫికేట్ పొందిన మొదటి చిత్రమిదే కావడం విశేషం. సినిమా రన్‌టైమ్‌ను 2 గంటల 14 నిమిషాలుగా లాక్ చేశారు. చివరి నిమిషంలో టైటిల్ మార్చినప్పటికీ, సినిమా కంటెంట్‌పై చిత్ర బృందం చాలా ధీమాగా ఉంది. గోపి అచ్చర దర్శకత్వం వహించిన చిత్రంలో శివాని నగరం హీరోయిన్‌గా నటించగా సీనియర్ నటుడు వికె నరేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి నరేంద్రరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించగా, షణ్ముఖ ప్రశాంత్ కథను అందించారు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతాన్ని అందించారు.



# ఇంటెన్స్ థ్రిల్లర్‌తో అనుపమ



నటి అనుపమ పరమేశ్వరన్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. ఆమె ప్రధాన పాత్రలో ఒక భారీ సైకలాజికల్ థ్రిల్లర్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్, బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి ఆర్జే షాన్ దర్శకుడు. గతంలో అనుపమ, షాన్ కాంబినేషన్‌లో వచ్చిన షార్ట్ ఫిల్మ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సెన్సేషన్ క్రియేట్ చేయడంతో, ఇప్పుడు అదే జోడీ వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరిస్తున్న చిత్రం ఒక ప్రముఖ స్టూడియో భాగస్వామ్యంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందనుంది. ముఖ్యంగా ఈ చిత్ర నిర్మాత ప్రేరణ అరోరా గతంలో బాలీవుడ్‌లో 'రుస్తుం', 'ప్యాడ్ మ్యాన్', 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ' వంటి జాతీయస్థాయి విజయవంతమైన చిత్రాలను నిర్మించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'జటాధర' మూవీని పట్టాలెక్కించిన ఈ సంస్థ, ఇప్పుడు అనుపమతో ఇంటెన్స్ థ్రిల్లర్‌ను అనౌన్స్ చేయడం విశేషం.మేలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్న సినిమా టైటిల్‌ను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం తెలిపింది. 'ప్రేమమ్', 'కార్తికేయ-2', 'రాక్షసుడు'వంటి హిట్స్‌తో సౌత్ ఇండియాలో బిజీ హీరోయిన్‌గా మారిన అనుపమ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌తో తన నటనలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించబోతోంది.

# ఇకపై నిర్మాతగానూ అడుగులు

నిత్యామీనన్ తన సినీ ప్రయాణంలో కొత్త మలుపులోకి ఎంటరవుతోంది. గత ఏడాది మూడు విభిన్న చిత్రాలతో పలకరించిన ఆమె, ఇప్పుడు నిర్మాతగా అవతారమెత్తుతోంది. 'కేయూరి ప్రొడక్షన్స్' పేరుతో సొంత నిర్మాణ సంస్థ ప్రారంభిస్తున్నట్టు సోషల్ మీడియా వేదికగా నిత్య అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఒక వీడియోలో తన నిర్మాణ సంస్థ లక్ష్యాలను ఆమె పంచుకున్నారు. కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా.. కథా బలమున్న చిత్రాలు, లోతైన పాత్రలు, మరియు సమాజంపై ప్రభావం చూపే కథలకే తన బ్యానర్ ప్రాధాన్యత ఇస్తుందని ఆమె స్పష్టం చేశారు. సినిమా అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది ప్రేక్షకులతో ఒక భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచాలని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుతానికి ఈ బ్యానర్ కింద ఎలాంటి ప్రాజెక్టులను ప్రకటించనప్పటికీ, నిత్యా మీనన్ తనకున్న పాత కమిట్‌మెంట్లను పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇకపై ఆమె నటిగా రాణిస్తూనే, అభిరుచి గల నిర్మాతగా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. విభిన్నమైన పాత్రలను ఎంచుకోవడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నిత్య, నిర్మాతగానూ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తారని చిత్ర పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.